Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 02.06.2017, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 52 పేజీలు : 12, వెల : ₹ 5

కేర్
డా॥ ఆలూరు స్వరూప్ కుమార్ రెడ్డి M.D.S.
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
సూపర్ స్పెషాలిటి దంత వైద్యశాల
పొగతోట, నెల్లూరు ✆ 9247004747
ఉచిత (క్యాష్‌లెస్) దంత వైద్యసేవలు
• రాష్ట్ర పోలీస్ ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత
• రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు EHS (ఎంప్లాయిస్ హెల్త్ స్కీము)

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## మేఘాల్లో మెరిసి మాయమైన...

# 'దర్శకరత్నం'

2లో




### దిగంతాలకేగిన బహుదూరపు బాటసారి

### శోకంలో సినీ లోకం



## పట్టు తగ్గిందా?

# పార్టీ పట్టాలు తప్పిందా?

- పార్టీపై కనిపించని చంద్ర మార్క్
- 'దేశం'లో కాంగ్రెస్ సంస్కృతి
- జెండాలు మోసిన వాళ్ళు దూరం

*ఇప్పుడున్న తెలుగుదేశం నందమూరి తారకరామారావు కాలం నాటి తెలుగుదేశం కాదు. కనీసం 1995-2004ల మధ్య కాలం నాటి చంద్రబాబు తెలుగుదేశం కూడా కాదు. ఇది మారిన తెలుగుదేశం. చంద్రబాబు ఏ విధంగా నేను మారానని చెప్పుకుంటున్నాడో... తెలుగుదేశం కూడా అదే విధంగా మారింది! కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్ సమ్మిళితంగా ఈ పార్టీ మారింది. కాబట్టే పార్టీపై అధినేత చంద్రబాబుకు పట్టు తప్పడమే కాదు, అసలు పూర్తిగా పార్టీయే పట్టాలు తప్పి అడ్డదిడ్డంగా పోతోంది.*

ఎన్టీఆర్ హయాంలో తెలుగుదేశంపార్టీ క్రమశిక్షణకు కేరాఫ్ అడ్రస్‌గా వుండేది. ఎన్టీఆర్ మాటే పార్టీలో శిలాశాసనం. ఆయన ఆదేశాలను ఎవరూ ధిక్కరించే వాళ్ళు కాదు. ఆయన నేతృత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఎంతో నిబద్ధతగా పనిచేసేవాళ్ళు. పార్టీని దాటి ఎవరూ బయట కూడా మాట్లాడేవాళ్ళు కాదు. తన క్యాబినెట్ నుండి 28మంది

(మిగతా 11వ పేజీలో)



## జగన్ Vs లోకేష్

# ఆ బాబుతో నీకేం పోలిక బాబూ!

*దొడ్డిదారిన వచ్చి వెన్నుపోటు పొడిచి గెలిచిన వాడిని 'వీరుడు' అనరు. ఓడినా, ప్రాణాలను వీడినా ఎదురొడ్డి నిలిచి పోరాడిన వాడినే వీరుడంటారు. దొడ్డిదారిన వచ్చింది విజయం కాదు. శత్రువును నిస్సహాయుణ్ణి చేసి గెలిచింది గెలుపూ కాదు. శత్రువును ధర్మయుద్ధంలో ఓడించడమే అసలైన విజయం. అది యుద్ధమైనా రాజకీయ యుద్ధమైనా?*

రాష్ట్ర రాజకీయాలలో ధర్మయుద్దాలకంటే అదర్మ యుద్ధాలనే ఎక్కువగా చూస్తుంటాం. ప్రస్తుతమున్న రాజకీయ పరిస్థితుల్లో ధర్మంగా వుంటే గెలవడం కష్టం కూడా! ఇలాంటి ధర్మయుద్ధం చేసే 2014 ఎన్నికల్లో వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అధికారానికి దూరం కావడం చూసాము.


ఇటీవల చంద్రబాబు స్వోత్కర్షను జనం భరించ లేకపోతున్నారు. ఏపికి నేనే బ్రాండ్‌నంటూ ఆయన వేస్తున్న బ్యాండ్‌ను భారంగా భరించాల్సి వస్తోంది. ఇప్పటివరకు చంద్రబాబే అనుకుంటే, ఇప్పుడు ఆయన తలదన్నేలా ఆయన కొడుకు లోకేష్ తయారయ్యాడు. తనను తాను రాష్ట్ర నాయకుడిగా చెప్పుకునేందుకు నానా తంటాలు పడుతున్నాడు. మాటికొస్తే జగన్ మీద పడి ఏడుస్తున్నాడు. అసలు జగన్‌తో లోకేష్‌కు పోలికేంటి? అసలు జగన్‌కు చంద్రబాబుతోనే పోలిక లేదు. ఎన్టీఆర్ పెట్టిన పార్టీనే ఆధారంగా చేసుకుని మనుగడ సాగిస్తున్న వాళ్ళు చంద్రబాబు, లోకేష్‌లు. వీళ్ళు సొంతంగా పార్టీని పెట్టలేదు. పార్టీకి కేడర్‌ను నిర్మించలేదు. ఎన్టీఆర్ పుణ్యాన రాజకీయ భవిష్యత్ లభించింది. అధికారం అనుభవించారు. ఎన్టీఆర్ నుండి పార్టీని లాక్కున్నారు. చంద్రబాబు చేతిలోకి పార్టీ వచ్చాక రెండుసార్లు గెలిచింది. అది కూడా 1999లో వాజ్‌పేయి ఇమేజ్‌తో, 2014లో మోడీ ప్రభంజనంతో అధికారం సంపాదించుకున్నారు. అంతకుమించి చంద్రబాబుకు సొంతంగా పార్టీని గెలిపించిన ఇమేజ్ లేదు. ఇక తండ్రి రాజకీయ వారసుడిగా రంగంలోకి వచ్చిన లోకేష్ ఈ మూడే ళ్లలో చూపించిన అద్భుత పెర్ఫార్మెన్స్ ఏమీ లేదు. కనీసం ప్రజాక్షేత్రంలో తనను తాను ప్రజానాయ కుడిగా నిరూపించుకోలేకపోయాడు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేసి ఎంపీగానో, ఎమ్మెల్యేగానో, లేదంటే ఎమ్మెల్సీగానే చట్టసభలలో అడుగుపెట్టే అవకాశం వున్నా, దొడ్డిదారిన శాసనమండలిలోకి ప్రవేశించాడు. తండ్రి కొలువులో మంత్రిగా కుర్చీ వేయించుకున్నాడు.

జగన్ ఆ పంథాలో పోలేదు. తన తండ్రి మరణానంతరం సొంత కాంగ్రెస్‌పార్టీ అధినేత్రే అతని మీద కత్తి కట్టింది. ప్రజల్లోకి పోవద్దంది. ప్రజలే తనకు లోకమన్న జగన్‌పై కేసులు పెట్టింది. 16నెలలు జైలులో పెట్టించింది. కాంగ్రెస్ నుండి బయటకొచ్చిన జగన్ అన్నీ భరించాడు. జైలు జీవితాన్ని అనుభవించాడు. ఓ పక్క ఢిల్లీతో తలపడ్డాడు. ఇంకోపక్క రాష్ట్రంలో అభ్యర్థులను ఎదుర్కొన్నాడు. సొంతంగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించాడు. సెకండ్ క్యాడర్‌లో వున్న కార్యకర్తలను లీడర్లుగా చేసాడు. 2014ఎన్నికల్లో ఒక్కడే పోరాడాడు. ఎన్టీఆర్ అంత సినిమా గ్లామర్ లేకున్నా తన స్వయం కృషితో 8మంది ఎంపీలను, 68మంది ఎమ్మెల్యేలను గెలిపించాడు. నాలుగు పదులు నిండిన వయసులోనే జగన్ సాధించిన ఘనవిజయమిది. చంద్రబాబు ధర్మంగా పోరాడివున్నా, జగన్ అధర్మయుద్ధం చేసున్నా 2014 ఎన్నికల్లో జగన్‌దే అధికారం. కాని జగన్ ఒక సైద్ధాంతిక విలువల పరిధిని దాటలేదు కాబట్టే ప్రతిపక్షనేతగా మిగిలిపోయాడు.

ఈరోజున్న రాజకీయ పరిస్థితుల్లో ఒక పార్టీని నడపడం ఎంత కష్టమో చూస్తున్నాం. చిరంజీవి లాంటి వాడే పార్టీ పెట్టిన రెండో సంవత్సరమే కాంగ్రెస్‌కు అమ్మేసుకున్నాడు. కాని, జగన్ తన పార్టీని నిలబెట్టాడు. మూడేళ్లుగా ధీటైన ప్రతిపక్షనేతగా రాణిస్తున్నాడు. అసెంబ్లీ లోపల, బయట ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టిస్తున్నాడు. రాష్ట్రంలో ఎప్పుడూ ప్రజల ముందుంటున్నాడు.

ఈరోజు జగన్ మీద వై.యస్. బ్రాండ్ లేదు. జగన్ తనను తాను నాయకుడిగా నిరూపించు కున్నాడు. ఢిల్లీ నుండి గల్లీ దాకా ప్రత్యర్థులతో అలుపెరుగని పోరాటం చేస్తూనే ప్రజలకు అండగా నిలుస్తున్నాడు. ప్రజామోదం పొందిన అలాంటి జగన్ ఎక్కడ? వర్ధంతికి, జయంతికి తేడా తెలియని లోకేష్ ఎక్కడ? ఆయనతో ఈయన పోటీ పడడం నక్కకు నాగలోకానికి వున్నంత తేడా వుంది.

# దిగంతాలకేగిన 'బహుదూరపు బాటసారి'



సినీరంగంలోని వారి జీవితం..ఓ 'అద్దాలమేడ' వంటిది. నిజంగా అదొక అద్భుత మాయా ప్రపంచం. స్వర్గం-నరకం' రెండూ ఇక్కడనే ఉన్నట్లుంటాయి. 'ఎవరికి వారే యమునా తీరే'..అన్నట్లుగా ఇక్కడ ఎవరి ప్రపంచం వారిది. ఎవరి ప్రతిభ వారిది. అయినప్పటికీ 'నేనే రాజు-నేనే మంత్రి' అన్నట్లుగా సినీలోకంలో రాణించారు. తన సినిమాలకు తానే మేస్త్రీ అయ్యారు. ఎంతో కృషితో..బహుముఖ ప్రజ్ఞాపాటవాలతో ఎదిగారు. 'తాత మనవడు' ఆత్మీయతలెలా వుంటాయో ప్రేక్షకుల కళ్ళకు కట్టినట్లు చూపారు. తన సినిమాల్లో సామాజిక సందేశాలకు ప్రాధాన్యతనిస్తూ 'జస్టిస్ చక్రవర్తి'గా నిలిచారు. 'జగన్నాథ రథ చక్రాలు'ను కదిలించారు. అక్రమాలను 'బొబ్బిలిపులి'లా ఎదిరించారు. అందరికీ ప్రేమాస్పదమైన 'మేఘ సందేశం' వినిపించారు. ప్రేమకథా చిత్రాలకు ఊపిరిపోసి అద్భుతమైన 'ప్రేమమందిరం' నిర్మించారు. ప్రేమకు ప్రేమతో 'ప్రేమాభిషేకం' చేశారు. అయినా...'జీవితమే ఒక నాటకం'. అలుపూ సొలుపూ లేకుండా చేసిన జీవితప్రయాణం..చివరికి దిగంతాలతో ముగుస్తుంది. చివరి మజిలీ దగ్గరకాగానే....తెరచాప అటే కదిలిపోతుంది. 'బహుదూరపు బాటసారి'...మెల్లిగా కదిలిపోతున్న జాడ కనిపిస్తుంది. అది కన్నీటి కాలువలో కదులుతున్న 'నీడ'లా అనిపిస్తుంది. ఆ నీటిబొట్టే..మనందరి కనుకొలుకుల్లోనూ నిలిచి..కన్నీటిమేఘమై వర్షిస్తుంది.... దర్శకరత్న దాసరికి కన్నీటి నివాళి.

పుట్టుక సహజం..మరణం కూడా అంతే. అయితే, పుట్టి-గిట్టేలోగా ఆ మనిషి తన జీవనయానంలో ఎలాంటి మహత్కార్యాలు సాధించాడన్నదే ముఖ్యం. అందులోనూ అత్యంత పేదరికంలో జన్మించి, కష్టాలతోనే జీవించినా..పట్టుదలతో, స్వయంకృషితో ఎదిగి..అత్యద్భుతమైన ప్రజ్ఞతో రాణించి, 'తెలుగు సినిమా(యా) లోకం'లో అసామాన్యమైన ఖ్యాతిని ఆర్జించడమంటే మాటలు కాదు. అంతటి అసాధారణ ప్రతిభా పాటవాలు ఆయన సొంతం. అందుకే ఆయన సినీలోకానికి దర్శకుడు కాగలిగాడు. ఎంతోమంది జీవితాలకు మార్గదర్శకుడు కాగలిగాడు. దర్శకులందరూ గర్వించేవిధంగా 'దర్శకరత్న' కూడా కాగలిగాడు. ఆయనే మన దర్శకరత్న దాసరి నారాయణరావు. తెలుగు చిత్రపరిశ్రమకు ఆయన మణిమకుటం వంటివారు. ఆయన ఆట..పాటా..మాట..బాటా అన్నీ విశిష్టమైనవే..విలక్షణమైనవే. ఏదీ మనసులో దాచుకోని తత్వం...ముక్కుసూటిగా మాట్లాడే మనస్తత్వం ఆయనవి. మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మహనీయమూర్తి ఆయన. అంతేకాదు, అన్యాయాన్ని ఎదిరించాలనే సాహసికుడు..సామాజిక ఉద్యమకారుడు కూడా. నీతి, నిజాయితీ.. నిష్కల్మషత్వం..నిర్భీతి ఆయన సుగుణాలు. ఎంతటి కష్టాన్నయినా సరే.. అధిగమించి జీవితపథంలో అత్యద్భుతాలు సాధించాలన్నదే ఆయన నైజం. కథా రచయితగా, పాటలు-మాటల రచయితగా, నటునిగా, దర్శకునిగా రాణించి.. తన ప్రతిభను చాటుకున్నారు. 151 చిత్రాలకు దర్శకునిగా దర్శకరత్న దాసరి వెండితెరకు బంగరు మెరుగులు దిద్దారు. నిర్మాతగా ఆయన ఎన్నో మంచి చిత్రాలను నిర్మించారు. మరో 250 సినిమాలకు రైటర్‌గా పనిచేశారు. తెలుగు సినీపరిశ్రమకు ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఎంతో ప్రతిష్టాత్మకమైన 'పద్మశ్రీ' పురస్కారం కూడా లభించింది.

## ఎన్నెన్నో అవార్డులు.. ఘన పురస్కారాలు

1983లో దాసరి నిర్మించిన 'మేఘసందేశం' చిత్రానికి రాష్ట్రప్రభుత్వం నుంచి 9 నంది అవార్డులే కాక, కేంద్రప్రభుత్వం నుంచి ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'రజత కమలం' పురస్కారం అందుకుంది. 1999లో ఆయన స్వయంగా నిర్మించిన 'కంటే కూతుర్నే కను' చిత్రానికి జాతీయపురస్కారంతో పాటు, రాష్ట్రప్రభుత్వ నంది అవార్డు కూడా లభించింది. 'తారక ప్రభు' సంస్థను నిర్మించి, జయసుధ కథానాయికగా శివరంజని చిత్రాన్ని తెరకెక్కించారు. నిర్మాతగా ఆయన 53 చిత్రాలను నిర్మించి అందరి ప్రశంసలు అందుకున్నారు. మోహన్‌బాబుకు నటునిగా జన్మనిచ్చిన తండ్రి దాసరి నారాయణరావే. తన గురువైన దాసరి నారాయణరావు ఇక...లేకపోవడం ఆయన గుండెల్ని తొలిచివేస్తోంది. ఇంకా మురళీమోహన్, జయసుధ, జయప్రద, సుజాత, ప్రభ, ఆర్.నారాయణమూర్తి వంటి ఉత్తమ నటీనటులను వెండితెరకు పరిచయం చేసిన ఘనత కూడా దాసరి నారాయణరావుగారిదే. ప్రముఖ దర్శకులుగా పేరెన్నికగన్న కోడి రామకృష్ణ, రేలంగి నరసింహారావు, రవిరాజా పినిశెట్టి వంటి దర్శకులు కూడా దాసరిగారి శిష్యులే. రాజకీయరంగంలోనూ దాసరి ప్రత్యేకత సాధించారు. 151 చిత్రాలకు దర్శకత్వం వహించి గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను సాధించారు. సామాజిక అంశాలతో సమాజం ప్రభావితం అయ్యేవిధంగా, అత్యంత సహజమన్నట్లుగా వుండేలా ఆయన చిత్రాలు వుండేవి. అందుకే ఆయన చిత్రాలు ప్రజల్లో బాగా ఆదరణ పొందాయి.

అదేవిధంగా కళామతల్లి ముద్దుబిడ్డగా ప్రఖ్యాతి చెంది విశిష్టమైన 'కళాప్రపూర్ణ' అవార్డును సాధించుకున్నారు. రెండు జాతీయ చలనచిత్ర పురస్కారాలు, 9సార్లు నంది అవార్డులను ఆయన అందుకున్నారు. రాష్ట్రప్రభుత్వం నుంచి రఘుపతి వెంకయ్య అవార్డును, ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని అందుకుని సినీ జగత్తులో తెలుగువెలుగుల బావుటాను ఎగురవేశారు. సంచలన దర్శకుడుగా ప్రఖ్యాతిగాంచారు. మేఘాల్లో దర్శకుని పేరును వేసుకుని సినిమారంగంలో దర్శకుని స్థాయి ఎంత ఉన్నతమైనదో తెలియజెప్పిన హిట్ డైరెక్టర్ ఆయనే. చిత్రసీమకు దాసరి చేస్తున్న విశిష్టసేవలకు గుర్తింపుగా తెలుగు సినీ పరిశ్రమ మరెంతో ఘనంగా ఆయనకు 'దర్శకరత్న' అవార్డునిచ్చి సత్కరించింది.

## 'తాతా-మనవడు'తో సినీరంగ ప్రస్థానం

తెలుగునాట ఉర్రూతలూగించి..350 రోజులు ప్రదర్శితమై రికార్డు సృష్టించింది. చిత్రసీమలో తనదైన ముద్ర వేసుకున్న 'తాతా మనవడు' చిత్రంతో ఆయన దర్శకునిగా తన సినీజీవిత ప్రస్థానం ప్రారంభించారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్ వంటి అగ్ర హీరోలతోనూ, వర్ధమాన నటీనటులతోనూ ఆయన ఆణిముత్యం లాంటి చిత్రాలెన్నిటినో నిర్మించారు. 'ఎవరికి వారే యమునా తీరే', స్వర్గం-నరకం', బలిపీఠం, శివరంజని, గోరింటాకు, రాధమ్మపెళ్ళి, సర్దార్ పాపారాయుడు, బొబ్బిలిపులి, మేఘసందేశం, గోరింటాకు, ప్రేమాభిషేకం, కంటే కూతుర్నే కను, అమ్మ రాజీనామా, అద్దాల మేడ, మామగారు, మేస్త్రి, ఒసేయ్ రాములమ్మా, ఒరేయ్ రిక్షా వంటి ఎన్నో చిత్రాలు ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనాలు.

## రాజకీయాల్లోనూ తనదైన ముద్ర

1989లో రాజీవ్‌గాంధీ పిలుపుతో ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. రాజ్యసభ సభ్యునిగా పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. కాంగ్రెస్ పార్టీలోనే చివరిదాకా కొనసాగారు. కాంగ్రెస్ హయాంలో, కేంద్రంలో బొగ్గు గనుల శాఖ సహాయమంత్రిగా కూడా పనిచేశారు. అదేవిధంగా, పత్రికారంగంలోనూ సాహసోపేతంగా వ్యవహరించారు. 'ఉదయం' పత్రిక ఆయన హృదయంగా వుండేది. దానితో పాటు, శివరంజని, బొబ్బిలిపులి తదితర పత్రికలను కూడా ఆయన సాహసోపేతంగానే నడిపారు.

మంచిని ప్రోత్సహించారు, చెడును దుయ్యబట్టారు. పత్రికా రంగంలో మార్గదర్శకమైన రీతిలో నడిచి అందరికీ స్ఫూర్తి దాయకమయ్యారు.

## కన్నీటి వీడ్కోలు

దర్శకరత్న దాసరి నారాయణరావు స్వస్థలం పాలకొల్లు. ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన సతీమణి పద్మ కొంతకాలం క్రితమే దివంగతులయ్యారు. సతి లేని శోకంతో ఆయన విలవిలలాడిపోయారు. ఆరోగ్యం అస్వస్థతకు గురయ్యారు. హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ ఈ నెల30వ తేదిన రాత్రి 7 గంటల సమయంలో శాశ్వత నిద్రలోకి జారిపోయారు. మేఘాల్లో మెరిసినట్లే మెరిసి మాయమయ్యారు. ఆ మేఘాల తేరుపైనే గగన వీధుల వెంట.. దూరతీరాలకు తరలిపోయారు. సినీలోకం శోకసంద్రంలో మునిగిపోయింది. ఆయన అంత్యక్రియలకు సినీపరిశ్రమే తరలివచ్చింది. వేలాది మంది కళాకారులు, నటీనటులూ, ప్రజలూ అందరూ కన్నీటితో వీడ్కోలు తెలిపారు. ఏదేమైనా, ఆయన అస్తమయంతో తెలుగు సినీపరిశ్రమ తనకు దారిచూపే ఒక మహాదర్శకుడిని.. మార్గదర్శకుడిని కోల్పోయింది. ఆ మహనీయ మానవతామూర్తికి.. కళామతల్లి ముద్దుబిడ్డకు.. నివాళులర్పిస్తోంది 'లాయర్'.






Veda Vyāsa వేదవ్యాస School
( Recognised by the Govt.of A.P )
Magunta Lay-out
Ph : 2302228
9849281870
SSC 2017 లో 10/10 GPA తో STATE TOP
10 10 10 10
48 మంది విద్యార్థులలో A1,A2 Grades 43
IIT / NEET Foundation
ADMISSIONS ARE IN PROGRESS
29 Years of Excellence
A.P. Balaji Correspondent

# గునపాలు దిగుతున్నాయ్...

## • అక్రమ కట్టడాలపై కొరడా



అక్రమ కట్టడాలపై నెల్లూరు నగర పాలక సంస్థ వాళ్ళు కొరడా ఝుళిపించారు. నగరంలో గుర్తించిన అక్రమ కట్టడాలను కూల్చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. మే31వ తేదీ నుండి అక్రమ కట్టడాల కూల్చివేత మొదలైంది. మొదటి రోజే ప్లాన్‌కు విరుద్ధంగా కట్టిన కట్టడాలను కూల్చారు. కట్టడాల స్లాబులపై గునపాలు దిగుతుండగా అది భవన యజమానుల గుండెల్లో దిగుతున్నట్లుగా వున్నాయి. ఆమోదించిన ప్లాన్‌లకు విరుద్ధంగా భవనాలను నిర్మించిన యజమానులు కళ్ళెదుటే కట్టడాలు కూలిపోతుండడం చూసి తట్టుకోలేకపోతున్నారు. కొందరైతే తమకు తెలిసిన కార్పొరేటర్లు, నాయకుల ద్వారా కూల్చివేతలు ఆపి వేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాని ఆర్‌డి ప్రదీప్ కుమార్, నగర కమిషనర్ ఢిల్లీరావుల పర్యవేక్షణలో అక్రమ కట్టడాల తొలగింపు ఆగడం లేదు. వేదాయపాలెం వద్ద ఓ అక్రమ కట్టడం తొలగింపు విషయంలో కార్పొరేటర్ రాజానాయుడుకు అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది.

నెల్లూరులో అక్రమ కట్టడాల తొలగింపు ప్రక్రియ ఓ పెద్ద ప్రహసనంగా ఉంటోంది. అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నది, వాటికి బిపిఎస్, బిఆర్‌ఎస్ స్కీములు అమలుచేసి సక్రమం చేస్తున్నది కార్పొరేషన్ వాళ్ళే! ఈ స్కీములను చూసే చాలామంది ప్లాన్‌లకు విరుద్ధంగా భవనాలు కట్టుకుంటున్నారు. అనుమతి వున్నదానికంటే కూడా ఒకట్రెండు అంతస్థులు అదనంగా వేస్తున్నారు. బిఆర్‌ఎస్ క్రింద రెగ్యులైజ్ చేయించుకోవచ్చనేది వారి ధీమా! దీనికి తోడు కార్పొరేషన్ అధికారులు కూడా భవనయజమానుల నుండి పదో పరకో తీసుకుని, మీకెందుకు ఇష్టం వచ్చినన్ని ఫ్లోర్‌లు వేసుకోండి, మేమున్నామని భరోసా ఇస్తారు. ఇలాంటి సమయాలలో చేతులెత్తేస్తారు. కార్పొరేషన్ అధికారుల మామూళ్ల మూలంగానే నగరంలో చాలామంది అనుమతి పొందిన ప్లాన్‌లకు విరుద్ధంగా భవనాలను కడుతున్నారు.

అక్రమ కట్టడాలను కూల్చివేయాల్సిందే! దీనిని ఎవరూ తప్పుబట్టరు. ఒక ఫ్లోర్‌కు అనుమతి తీసుకుని మూడు, నాలుగు ఫ్లోర్‌లు వేసేవాళ్ళ పట్ల కఠినంగానే వ్యవహరించాలి. కాని, రెండు, మూడు ఫ్లోర్‌లు అనుమతి తీసుకుని వాటర్ ట్యాంక్‌లు, చిన్న గదులు వంటి వాటిని కట్టుకున్నవారిని పెనాల్టీలతో సరిపెడితే బాగుంటుంది. పూర్తిస్థాయిలో నిబంధనలకు విరుద్ధంగా కట్టిన భవనాలను నేల మట్టం చేయాలి. అప్పుడే ఇంకొకరు భవన నిర్మాణాల విషయంలో నిబంధనలను అతిక్రమించకుండా వుంటారు.

# ఎస్పీ బాలు జన్మదిన మహోత్సవం

## తొలి సినీ నేపథ్యగాయని శ్రీమతి రావు బాలసరస్వతిదేవికి బాలు జాతీయ పురస్కారం





గానగంధర్వుడు, మన నెల్లూరు ముద్దుబిడ్డ పద్మ భూషణ్ డా. యస్.పి.బాల సుబ్రహ్మణ్యం జన్మదిన మహోత్సవ వేడుకలు ఈ నెల 6వతేదీ మంగళవారం సాయంత్రం 6.30గంటలకు నెల్లూరులోని రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం(టౌన్‌హాలు)లో జరుగనున్నాయి. ఈ వేడుకలో తొలి తెలుగు సినీ నేపథ్యగాయని శ్రీమతి రావు బాలసరస్వతీదేవికి తొలి యస్.పి.బాలసుబ్రహ్మణ్యం జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ తొలి పురస్కారాన్ని తన స్వహస్తాల మీదుగా అందజేయుటకు ఈ వేడుకకు బాలసుబ్రహ్మణ్యమే వస్తుండడం విశేషం. సినీ గీతరచయిత వెన్నెలకంటి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమాన్ని మురళీకృష్ణ హోటల్స్ అధినేత వీరిశెట్టి హజరత్‌బాబు ప్రారంభిస్తారు. గేయధార సృష్టికర్త డాక్టర్ వి.బి.సాయికృష్ణ యాచేంద్ర, 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం, మాడరన్ స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెల్లంచేటి చంద్రమౌళిలు ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారు. సంగీత శ్రోతలు, బాలు అభిమానులు ఈ వేడుకకు విచ్చేసి జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.



# జిఎస్ఎల్‌వి-మార్క్3డి1 ప్రయోగానికి సిద్ధం

భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్(షార్) జిఎస్ఎల్‌వి-మార్క్3డి1 ప్రయోగానికి సిద్ధమైంది. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5.28 గంటలకు జిఎస్ఎల్‌వి-మార్క్3డి1 రాకెట్ నింగిలోకి దూసుకెళ్ళనుంది. ప్రస్తుతం రాకెట్‌ను రెండో ప్రయోగ వేదికపై వుంచి అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే షార్‌కు ఇస్రోలోని పలు విభాగాల సీనియర్ శాస్త్రవేత్తలు చేరుకుని ప్రయోగ సన్నాహాల్లో నిమగ్నమయ్యారు.







## 'ప్రభా'తం

***ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ ఈ మూడేళ్ళ కాలంలో అనేక విజయాలనే సాధించారు. దేశాభ్యున్నతి కోసం సాహసమైన నిర్ణయాలే తీసుకుని దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారు. సమస్యలెన్నున్నా ధీటుగా ఎదుర్కొంటూ అప్రతిహతంగా ముందుకు సాగిపోతున్నారు.***

# మూడేళ్లలో ముచ్చటైన పాలన



**ఏళ్ళ తరబడిగా కుంభకోణాలు, అవినీతి అక్రమాలతో, అన్ని రంగాలు వెనుకబడిపోయి అస్తవ్యస్థ స్థితిలో వున్న దేశంలో, కేవలం ఈ మూడేళ్ళ కాలంలోనే అత్యద్భుతమైన అభివృద్ధిని సాధించాలంటే ఎవరికైనా కష్టమే. అయితే, ఆ దారిలో సాహసోపేతంగా పనిచేస్తూ దేశాన్ని ప్రగతి దారి పట్టించినందుకు, ఈ మూడేళ్లలో ఎలాంటి అవినీతి మచ్చ లేకుండా, దేశాభ్యున్నతికి కంకణం కట్టుకుని చిత్తశుద్ధితో అహరహం పనిచేస్తున్నందుకు ప్రధాని మోడీని, మోడీ ప్రభుత్వాన్ని అందరూ అభినందించాల్సిందే.**

పాలనాపరంగా పారదర్శకత, గట్టి రాజకీయ నిర్ణయాలు, వినూత్నమైన ఆలోచనలు..మంచిమంచి పథకాలు, ఆకట్టుకునే ప్రసంగాలతో ప్రధాని మోడీ అందరి మనసులను ఇట్టే ఆకట్టుకుంటున్నారు. మంచి పరిపాలనా దక్షునిగా పేరు తెచ్చుకుని, బిజెపి అగ్రనాయకునిగా ఆయన తన ప్రతిష్టను ఎప్పటికప్పుడు నిలబెట్టుకుంటూనే వున్నారు. దేశంలో ఆరోవంతు జనాభా వున్న ఉత్తరప్రదేశ్‌లో అధికారంలోకి రావడమంటే మాటలు కాదు. అలాంటిది ఎవరూ ఊహించని విధంగా ఆయన సారధ్యంలో, బిజెపి నేతృత్వంలో అక్కడ అద్భుతమైన విజయాన్నే సాధించి రికార్డ్ సృష్టించారు. ఒక్క యుపిలోనే కాదు, ప్రధానిగా మోడీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మహారాష్ట్ర, హర్యానా, అస్సాం, మణిపూర్‌లలో బిజెపి ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. జమ్ము కశ్మీర్‌లోనూ పిడిపితో కలిసి బిజెపి సంకీర్ణప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం జరిగింది. ఆ తర్వాత జార్ఖండ్, ఉత్తరాఖండ్, గోవాల్లోనూ బిజెపి తిరుగులేని పార్టీగా అవతరించి అధికారంలోకి వచ్చింది. ఢిల్లీ మునిసిపల్ ఎన్నికల్లోనూ బిజెపి తన సత్తా చాటింది. ఇదంతా మోడీ ప్రభావంతోనేనన్నది అందరికీ తెలిసిన విషయమే. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ విజయాలన్నీ ఆయన ఖాతాలోనివే. మోడీ ధాటికి కాంగ్రెస్ ఎక్కడా నిలబడలేకపోతోంది. ప్రతిపక్షాలు సైతం మోడీ నిర్ణయాలను కాదనలేని పరిస్థితి. ఒక్క రాజకీయంగానే కాక, అనేక ప్రజాసంక్షేమ పథకాలతో, మంచి నిర్ణయాలతో మోడీ ప్రభుత్వం ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సాధించుకుంటూ ముందుకు సాగుతోంది. అధికారం తమ చేతుల్లో వుంటే ఎన్నో కుంభకోణాలతో దేశాన్ని అవినీతి మయం చేసినవారిని కూడా మనం చూశాం. అధికారం ఉంది కదా అని ఎన్నో అక్రమాలకు పాల్పడి దేశాన్ని గుల్ల చేసిన వారినీ చూశాం. అయితే, నరేంద్రమోడీ ఆధ్వర్యంలో, బిజెపి పాలనలో ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాకపోవడం ఎంతైనా చెప్పుకోదగిన విషయం. ఇది మోడీ మార్క్ పాలనకు..మంచి పరిపాలనకు గుర్తుగా నిలిచిపోతోంది. ప్రజాబలమే దన్నుగా మోడీ జనరంజక పాలన సాగిస్తుండడంతో మొన్నటిదాకా దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ సైతం క్రమేణా కనుమరుగయ్యే దశకు చేరుకుంటోంది. పెద్దనోట్ల రద్దు విషయంలోనూ జరిగిందిదే. అప్పట్లో ఇది అసాధ్యమన్న కొందరు నాయకులు మోడీ దృఢనిశ్చయంతో ఆ నిర్ణయం అమలులోకి రావడం.. అది సుసాధ్యం కావడంతో ఇప్పుడు గుడ్లు తేలేస్తున్నారు. పెద్దనోట్ల రద్దుతో అవినీతి నడ్డి విరగడంతో పాటు, సామాన్యప్రజల్లో మోడీ విధానాలు ఎంతో మెచ్చుకోదగ్గవిగా ప్రశంసలందుకుంటున్నాయి. మరోవైపు ప్రపంచ మానవాళిని భయకంపితుల్ని చేస్తున్న ఉగ్రవాదాన్ని కూకటివేళ్ళతో సహా పెకలించేందుకు ప్రపంచదేశాలన్నీ కలిసి సమిష్టిగా పోరు సాగించాలని కోరుతూ దేశవిదేశాల్లో ఆయన చేస్తున్న ఉత్తేజపూరిత ప్రసంగాలు ప్రపంచ ప్రజలందరినీ బాగా ఆకర్షిస్తున్నాయి.

ఈ మూడేళ్ళలో ప్రధాని వినూత్నంగా ప్రవేశపెట్టిన డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, జన్ ధన్ యోజన, స్వచ్ఛభారత్ వంటి పథకాలతో పాటు మోడీ తనదైన శైలిలో ప్రారంభించిన మన్ కీ బాత్, 'యోగా' వంటి కార్యక్రమాలు ప్రజల్ని విశేషంగా ఆకట్టు కుంటున్నాయి. గతంలో కంటే ఇప్పుడు ఆర్థికాభివృద్ధి వేగం పుంజుకోవడం, జిడిపి వృద్ధి రేటు పెరగడం, ద్రవ్యోల్బణం తగ్గుతూ వుండడం గమనించాల్సిన విషయం. ఇది మోడీ మార్క్ అభివృద్ధికి సంకేతం. అంతేకాదు, చిత్తశుద్ధి, దైవభక్తి, దేశభక్తి కలగలిసిన ప్రధాని నరేంద్రమోడీ ఏమిచెప్పినా అది ప్రజలకు ప్రయోజనకరంగానే వుంటుందనే విశ్వాసం ప్రజల్లో పాదుకోవడంతో ఆయన దేశంలోనే ఒక శక్తిమంతమైన నాయకునిగా నిలిచి ప్రజలందరి ప్రశంసలు అందుకుంటున్నారు. అందుకే, ఈ మూడేళ్ళలోనే సోషల్‌మీడియాలో అత్యధిక ఫాలోయింగ్ వున్న అతితక్కువ ప్రపంచనాయకుల సరసన ప్రధాని నరేంద్రమోడీ స్థానం సంపాదించడం ఎంతైనా విశేషం. ఫేస్‌బుక్‌లో మోడీకి మూడేళ్ళ క్రితం 1.4 కోట్ల మంది ఫాలోయర్లు వుండగా, తాజాగా ఇప్పుడది 4.1 కోట్లకు చేరుకుందంటే మోడీ పట్ల ప్రజాభిమానం ఎలా వెల్లువెత్తుతోందో అర్థం చేసుకోవచ్చు. మోడీ ప్రవేశపెట్టిన డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, జన్ ధన్ యోజన, స్వచ్ఛభారత్ పేజీలకు కూడా ఫేస్‌బుక్‌లో మంచి ఆదరణ లభిస్తోండడం ఆ పథకాల పట్ల జనాదరణకు మంచి సూచిక. అయితే, భారత్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇంకా అనేకమైన సవాళ్లు ఎదురవుతూనే వున్నాయి. ఉగ్రవాదం, సరిహద్దు సమస్యలు, కశ్మీర్ సమస్య ఇలా అనేక సమస్యలు చుట్టుముట్టే వున్నాయి. పథకాల ప్రచారపటాటోపం కంటే ప్రయోజనం తక్కువగా వుంటోందని, దేశంలో నిరుద్యోగం సమసిపోలేదని, పేదరికం పోవడం లేదని, ప్రజా సంక్షేమ పథకాలు అసలైన లబ్దిదారులకు చేరడం లేదనే విమర్శలూవున్నాయి. వీటన్నిటినీ కూడా పరిశీలించి పరిష్కరించాల్సి వుంది.

ఏదేమైనా, ప్రపంచంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ఒకటి కావడం హర్షదాయకం. ఏళ్ళ తరబడిగా కుంభకోణాలు, అవినీతి అక్రమాలతో, అన్ని రంగాలు వెనుకబడిపోయి అస్తవ్యస్థ స్థితిలో వున్న దేశంలో, కేవలం ఈ మూడేళ్ళ కాలంలోనే అత్యద్భుతమైన ప్రగతిని సాధించడం ఎవరికైనా కష్టమే. అయితే, ఆ దారిలో కృతనిశ్చయంతో సాహసోపేతంగా పనిచేస్తూ దేశాన్ని ప్రగతి దారి పట్టించినందుకు, ఈ మూడేళ్ళలో ఎలాంటి అవినీతి మచ్చ లేకుండా, దేశాభ్యున్నతికి కంకణం కట్టుకుని అహరహం చిత్తశుద్ధితో పని చేస్తున్నందుకు ప్రధాని మోడీని, మోడీ ప్రభుత్వాన్ని అందరూ అభినందించాల్సిందే.

# ముగిసిన క్రీడా శిక్షణ శిబిరాలు

నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 20రోజులుగా నిర్వహిస్తున్న బ్యాట్మింటన్, ఫుట్‌బాల్ రెసిడెన్షియల్ వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ఆదివారంతో ముగిసాయి. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని జిల్లా క్రీడా ప్రాధికారసంస్థ కార్యాలయంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు క్రీడాసామాగ్రిని అందజేశారు. ముఖ్యఅతిథిగా నగర డిప్యూటీ మేయర్, ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పాల్గొన్నారు. విశిష్టఅతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి రమణరావు మాట్లాడుతూ ఉత్తమ క్రీడాకారులుగా గుర్తింపు పొందేందుకుగానూ రాష్ట్ర ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధంగా తొలిసారిగా రెసిడెన్షియల్ సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంప్‌లకు శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం రాష్ట్ర క్రీడా ప్రాధికారసంస్థ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ రామకృష్ణ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి కలిగించేందుకుగానూ ఫిజికల్ లిటరసీని ఏర్పాటు చేస్తూ నిర్భంధ విద్యను ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ క్రీడాకారులు 110 మందికి రూ. 1.3లక్షలు విలువజేసే క్రీడాసామాగ్రిని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా అందజేసామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రమణయ్య తెలిపారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి పసుపులేటి రామ్మూర్తి, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ కోచ్‌లు సుధాకర్ రెడ్డి, భాస్కర్, పాండు రంగారావు, హరి పాల్గొన్నారు.

### ముగిసిన అథ్లెటిక్ శిక్షణ శిబిరం

ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించి విజేతలకు పతకాలను అందజేశారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కోడూరు రవీంద్రరెడ్డి, అరిగెల విజయకుమార్, వివిధ క్రీడా సంఘాల నిర్వాహకులు సనత్‌కుమార్, రవిచంద్ర, పావురాల వేణు, వెంకటసుబ్బయ్య, గాదం శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# 6న కవి సమ్మేళనం

యూనియన్ ఆఫ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ మంగళవారం సాయంత్రం 5గంటలకు నెల్లూరు టౌన్‌హాల్ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో కవిసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షకార్యదర్శులు సర్వేపల్లి రామ్మూర్తి, గడ్డం హనోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కవిసమ్మేళనంలో కవి మిత్రులు, రచయితలు, సాహిత్యాభిలాషులు పాల్గొని తమ కవితలను వినిపించాలని, సమ్మేళనంలో పాల్గొన్న వారికి చిరుసత్కారం చేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో జర్నలిస్టుల పాత్ర అనే అంశం పై 25లైన్లను మించకుండా కవితను రాసి జెరాక్స్‌తో పాటు పాస్‌పోర్టు సైజు ఫోటో, పూర్తి చిరునామా సెల్ నెంబర్‌తో నిర్వాహకులకు అందజేయాలన్నారు.

# ఉద్యోగినులకు వేధింపులు

నెల్లూరు జలవనరులశాఖ సర్కిల్ కార్యాలయంలో పని చేస్తున్న షేక్ షంషాద్ అనే ఉద్యోగి అసోసియేషన్ నాయకుడిగా ఉంటూ మహిళా ఉద్యోగినుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నాడు. అసోసియేషన్ పదవిని అడ్డంపెట్టుకుని ప్రముఖ నాయకులతో, మంత్రులతో తాను దిగిన ఫోటోలను ఫేస్‌బుక్‌లో పెడ్తూ ఎవరికి ఎటువంటి పనులు కావాలన్నా బదిలీలు చేయిస్తానని ప్రలోభపెట్టి వారి జీవితాలతో ఆడుకుంటున్నాడు. మాటవినని వారిని బదిలీ చేయిస్తానని బెదిరిస్తున్నాడు. గతంలో కూడా తన ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో స్త్రీల గురించిన అసభ్య కామెంట్స్, వాటికి తోటి అధికారుల మరింత అసభ్యకరమైన లైక్స్, కామెంట్స్‌ను సాక్ష్యాలతో సహా శాఖాధికారులకు, జిల్లా ఉన్నతాధికారులకు, ఏ.పి మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఏ.పి మహిళా కమిషన్ నాయకులు కేవలం రాజకీయాలకే పరిమితం అవుతూ మహిళా సమస్యలు పట్టించుకోవడం లేదు. నీరు చెట్టు పథకంలో జరిగిన భారీ అవినీతిలో సదరు నాయకుడు మరికొందరి పాత్రను సాక్ష్యాలతో సహా ఎ.సి.బి వారికి సమర్పించాము. ఒక గౌరవప్రద అసోసియేషన్ నాయకుడి హోదాలో ఉంటూ మహిళల పట్ల అగౌరవంగా ప్రవర్తిస్తూ వాలెంటైన్స్‌డే శుభాకాంక్షలు తెలుపడం అలాగే ఇటీవల మహిళా దినోత్సవం సందర్భంగా కూడా మహిళా దినోత్సవం యొక్క ఔన్నత్యాన్ని మంట గలుపుతూ ఆరోజున కూడా వాలెంటైన్స్‌డే తరహాలో మెసేజ్‌లు పంపుతూ మహిళల గౌరవాన్ని మంట కలుపుతున్నాడు. దీనికి సహనాయకులు వత్తాసు పలకడం అగౌరవనీయం.

**నెల్లూరుజిల్లా జలవనరుల శాఖ మహిళా ఉద్యోగులు, నెల్లూరు.**

# ఏపిని దివాళా తీయించాడు

రాష్ట్ర విభజన జరిగినా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన నష్టం ఏమీ లేదు. రాష్ట్రంలో 13జిల్లాలుంటే పది జిల్లాల్లో సారవంతమైన భూములున్నాయి. తెలివైన యువత, కష్టించే రైతాంగం వుంది. రెండుజిల్లాల్లో అపార ఖనిజసంపద వుంది. అనంతపురం, కడప జిల్లాలు మాత్రమే కొంత వెనుకబడి వుంటాయి. అయినా కూడా అంత ఇబ్బంది ఏమీ లేదు. విభజన వల్ల మనకు కొత్తగా జరిగిన నష్టమేమీ లేదు. జరిగిన నష్టమంతా కూడా చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం మూలంగానే జరిగింది. కేంద్రం నుండి వేలకోట్ల నిధులిచ్చామని ఈమధ్యే అమిత్‌షా చెప్పాడు. ఆ నిధులు ఏమయ్యాయో తెలీదు. అమరావతి రాజధాని అంటున్నారు గాని ఒక బిల్డింగ్ కట్టారు తప్పితే ఇంకేమీ లేదు. పోలవరంకు కేంద్రమే నిధులిస్తుంది. వచ్చిన నిధులన్నింటినీ చంద్రబాబు సర్కార్ తన ఆర్భాటాలకే తగలేసింది.


**గోశాల రమణరావు, నెల్లూరు.**




# అవయవాలు తీసేయాలి

నిర్భయ చట్టం అంటే కూడా రేపిస్టులకు భయం పోయింది. రేపిస్టులు రెచ్చిపోతున్నారు. శిశువుల నుండి 60ఏళ్ల వృద్ధుల వరకు ఎవరినీ వదలకుండా మానభంగాలు, హత్యలు చేస్తున్నారు. ఈ అరాచకాలను దారికి తేవాలంటే రేపిస్టులకు అవయవాలు తీసేయాలి. **– వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

**రైతు కొడుకు రైతు కావాలనుకోవడం లేదు, కూలీ కొడుకు కూలీ కావాలనుకోవడం లేదు, సన్న చిన్న వ్యాపారుల కొడుకులు కూడా వ్యాపారస్థులు కావాలనుకోవడం లేదు. వృత్తి కళాకారుల కొడుకులు వృత్తి కళాకారులు కావడం లేదు. కాని సినిమా స్టార్‌ల కొడుకులు సినిమా స్టార్‌లు అవుతున్నారు. అలాగే రాజకీయ నాయకుల కొడుకులు రాజకీయ నాయకులవుతున్నారు! ఎందుకని?**



# వరుసలో వారసులు

- **జిల్లా రాజకీయాల్లో కుటుంబసభ్యుల హవా**
- **ఒక్కొక్కరుగా తెరమీదకు వస్తున్న యువనేతలు**

ప్రైవాటిలో వేటిలోనూ లేని డబ్బు, పలుకుబడి, క్రేజ్, ఇమేజ్ ఈ రెండు రంగాల్లోనే వున్నాయి. అందుకే సినిమా రంగంలో మాదిరిగానే రాజకీయ రంగంలోనూ వారసత్వ సాంప్రదాయం కొనసాగుతోంది.

జిల్లాలో ఇప్పుడున్న రాజకీయాలలో ఆనం, నల్లపరెడ్డి, నేదురుమల్లి, మేకపాటి వంటి కుటుంబాల నుండి రెండు తరాల నాయకులను చూసాము. కాగా, ఇప్పుడు ఆయా రాజకీయ కుటుంబాల నుండి మూడోతరం నాయకులు కూడా సిద్ధంగా ఉండడం చూస్తున్నాం. ఇప్పటికే కొందరు వారసులు రాజకీయరంగ ప్రవేశం చేయగా, మరికొందరు తెరలేపడమే తరువాయి అన్నట్లుగా రాజకీయ రంగప్రవేశానికి రెడీగా వున్నారు.

ఆనం కుటుంబంలో మూడోతరం నాయకులు ప్రవేశించి వున్నారు. ఆనం వివేకా తనయులు ఏ.సి.సుబ్బారెడ్డి 2014 ఎన్నికల్లో నెల్లూరు నగర కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి పరాజయం పొందడం తెలిసిందే! తర్వాత తండ్రి వివేకాతో పాటు తెలుగుదేశంలో చేరి ఆ పార్టీలో కొనసాగుతున్నాడు. భవిష్యత్‌లో నెల్లూరు నగరంలో తమ రాజకీయ వారసుడిగా ఏసిని తీర్చిదిద్దేందుకు వివేకా విశ్వప్రయత్నం చేస్తున్నారు. అలాగే వివేకా రెండో కొడుకు ఆనం రంగమయూర్‌రెడ్డి కార్పొరేటర్‌గా కొనసాగుతూ తండ్రితో పాటే తెలుగుదేశంలో వుంటూ వాగ్ధాటిలోనూ, రాజకీయంగా దూసుకుపోవడంలోనూ తండ్రికి ఏ మాత్రం తీసిపోని కొడుకనిపించుకుంటున్నాడు. ఇక 2004 నుండి 2014ల మధ్య కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంతో చురుకుగా పనిచేసి, తన పెదనాన్న వివేకా జుట్టులో దూరిపోతాడని పేరు తెచ్చుకున్న మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తనయుడు ఆనం శుభకర్‌రెడ్డి తమ కుటుంబసభ్యులు తెలుగుదేశంలో చేరడం నచ్చకో ఏమో, రాజకీయాలకు దూరంగా వుంటున్నాడు. ఆనం విజయకుమార్‌రెడ్డి కొడుకు ఆనం కార్తికేయరెడ్డి కూడా రాజకీయ ఎంట్రీకి రెడీగా వున్నాడు. ఇటీవల జరిగిన స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీచేసిన తన తండ్రి తరపున ఎన్నికల క్యాంప్ అంతా కూడా కార్తికేయరెడ్డే పర్యవేక్షించాడు. భవిష్యత్‌లో ఆనం విజయ రాజకీయ వారసుడిగా కార్తికేయరెడ్డి వైసిపిలో కీలకపాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది. ఇక స్వర్గీయ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి మనుమడు, మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనయుడు సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి రాజకీయ రంగ ప్రవేశం కూడా దాదాపు జరిగిపోయినట్లే! 2014 ఎన్నికలప్పటి నుండే రాజగోపాలరెడ్డి తెరమీదకొచ్చాడు. తండ్రి తరపున ఎన్నికల బాధ్యతలు చూస్తున్నాడు. ఇటీవల సర్వేపల్లి నియోజకవర్గంలోనూ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నాడు.


అలాగే నల్లపరెడ్డి కుటుంబంలోనూ మూడోతరం యువనాయకుడి ఎంట్రీ రెడీగా వుంది. స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మనుమడు, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తనయుడు రజిత్‌రెడ్డి కూడా రాజకీయాల్లో ప్రవేశించాడు. ఎన్నికల సమయంలో తన తండ్రి తరపున పని చేస్తున్నాడు. తండ్రి రాజకీయ వారసుడిగా ఎదుగుతున్నాడు.

మెట్టప్రాంతం ఉదయగిరి నుండి చూస్తే ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి కొడుకు గౌతమ్‌రెడ్డి ఆల్‌రెడీ రాజకీయాల్లో ప్రవేశించి ఆత్మకూరు శాసనసభ్యులుగా కొనసాగుతుండడం తెలిసిందే! అలాగే ఈ ప్రాంతంలో ప్రజాబలం వున్న నాయకుడిగా పేరున్న మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి తన రాజకీయ వారసుడిగా తన కొడుకు కొండారెడ్డిని తెర మీదకు తేనున్నట్లు తెలుస్తోంది. రాజకీయాలలో డబ్బు రాజ్యమేలుతున్న ఈ రోజుల్లో కూడా ఉదయగిరిలో డబ్బు లేకుండా రాజకీయాలు నడపగల నాయకుడు విజయరామిరెడ్డి. తన రాజకీయ అనుభవంతో తన కొడుకును మంచి నాయకుడిగా తీర్చిదిద్దాలనే ప్రయత్నంలో వున్నట్లు తెలుస్తోంది. సూళ్ళూరుపేటలో స్వర్గీయ వేనాటి మునిరెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డిల రాజకీయ వారసులుగా వేనాటి సురేష్‌రెడ్డి, వేనాటి సతీష్‌రెడ్డి, వేనాటి సుమంత్‌రెడ్డిలు రంగంలోకి దిగి వున్నారు.

ఇలా జిల్లాలో వారసత్వ రాజకీయాల పరంపర కొనసాగుతోంది. వచ్చే ఎన్నికల్లో తండ్రులకు బదులుగా వారి స్థానాల్లో తనయులు పోటీకి దిగినా ఆశ్చర్యపోనవసరంలేదు.

# కావలి వాకిలిలో విమానాశ్రయ కలవరం

- **బీద బ్రదర్స్‌కు సవాల్**



నెల్లూరుజిల్లా దగదర్తి మండలం దామవరం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వంలో మంజూరైన విమానాశ్రయాన్ని రద్దు చేస్తున్నట్లు ఇటీవల జిల్లాకొచ్చిన రాష్ట్ర ఇంధన, పెట్టుబడుల శాఖ కార్యదర్శి అజయ్‌జైన్ ప్రకటించడం బీద సోదరులకు పెద్ద తలనొప్పిగా మారింది. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు ప్రతిష్టకు ఇది సవాల్‌గా మారింది. ఎయిర్‌పోర్టు ఇక్కడ నుండి నిజంగానే ఎగిరిపోతే, దానిని నిలుపుకోలేని నిస్సహాయులుగా బీద బ్రదర్స్‌పై ముద్రపడుతుంది. కావలి నియోజకవర్గ ప్రజల్లో ఇది తీవ్ర అసంతృప్తికి దారితీస్తుంది.

2004-2014ల మధ్య కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పారిశ్రామికాభివృద్ధి గాని, మౌలిక సదుపాయాల కల్పనగాని అంతా నెల్లూరుకు దక్షిణం వైపే విస్తరిస్తూ పోయింది. కృష్ణపట్నం పోర్టు అయితేనేమీ, పవర్‌ప్రాజెక్టులైతేనేమీ, చింతవరం సెజ్, మేనకూరు సెజ్, మాంబట్టు సెజ్, శ్రీసిటీ... ఇత్యాది అభివృద్ధి కేంద్రాలన్నీ కూడా నెల్లూరు - తడల మధ్యే కేంద్రీకృతమైపోయాయి. ఆ టైంలో రాచర్లపాడు వద్ద ఇఫ్కో సెజ్‌కు శంకుస్థాపన జరిగినా పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. కాని దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి దామవరం వద్ద ఎయిర్‌పోర్టును ప్రకటించి ఈ ప్రాంతవాసుల్లో, కావలి నియోజకవర్గ ప్రజల్లో ఆశలు మొలకెత్తించారు. ఇక్కడ ఎయిర్‌పోర్టు అన్నాకే ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. కొంచెం ఆలస్యంగానైనా సరే ఇక్కడ ఎయిర్‌పోర్టు షురూ... త్వరలో విమానం ఎగరడం చూస్తాం అని జనం ఎదురుచూస్తున్న తరుణంలో ఇక్కడ ఎయిర్‌పోర్టు రద్దు చేస్తున్నట్లు అజయ్‌జైన్ చేసిన ప్రకటన ప్రజలను నిరుత్సాహానికి గురిచేయడమే కాదు, రాజకీయంగా అధికార పార్టీలో వున్న బీద సోదరులకు నష్టం కలిగించేదే! ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత పెరిగి, అది పరోక్షంగా బీద సోదరులనే దెబ్బతీస్తుంది. అందుకే బీద సోదరులు ఎగిరిపోయిందనుకున్న ఎయిర్‌పోర్టును సాధించడమే కాదు, దానికి శంకుస్థాపన చేయించి పనులు మొదలుపెట్టించి తమ పనితనం చాటుకోవాలనే పట్టుదలతో ప్రయత్నాలు జరుపుతున్నారు.

# ఆశల పల్లకిలో అనూరాధ



తెలుగుదేశంపార్టీకి సంబంధించి జిల్లాలో చెప్పుకోదగ్గ మహిళా నాయకురాలు టి.అనూరాధ! పార్టీలో ఎంపీ, జడ్పీ ఛైర్‌పర్సన్‌ల స్థాయిలో పనిచేసిన మహిళా నాయకురాళ్ళు ఇప్పుడు కనిపించకపోయినా, అనూరాధ మాత్రం మొదటి నుండి ఇప్పటి వరకు పార్టీలో ఒకే స్థాయిలో వుంది. ఒకే పని విధానంతో నడుస్తోంది.

2000 సంవత్సరంలో నెల్లూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా విజయం సాధించిన ఆమె ఐదేళ్లపాటు ఆ పదవిలో పద్ధతిగా రాణించింది. ఆనం వివేకా వంటి రాజకీయ ఎక్స్‌పర్ట్‌ను బలంగానే ఢీకొట్టి నిలిచింది. భర్తచాటు భార్యగా రాజకీయాల్లోకి వచ్చినా, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా తన పరిపాలనలో భర్త ముద్ర లేకుండా చేసుకుని పరిపూర్ణ మహిళా నాయకురాలిగా గుర్తింపు పొందింది. పార్టీ అధికారంలో లేని ఈ పదేళ్లు కూడా పార్టీని వీడకుండా అంటిపెట్టుకుని వుంది. జిల్లాలో మహిళానాయకురాళ్ల పరంగా చూస్తే ప్రాధాన్యతనివ్వాల్సిన నాయకురాలు అనూరాధ. నామినేటెడ్ పదవుల్లో ఆమె 'నుడా' ఛైర్మెన్‌ను ఆశించింది. కాని దానిని కోటంరెడ్డి శీనయ్యకు దాదాపు ఖరారు చేశారు. దీంతో ఆమెను టీటీడీ బోర్డు సభ్యురాలిగానో, లేక మహిళా కమిషన్ సభ్యురాలిగానో నియమిస్తారని సమాచారం. కాని ఆమె మాత్రం ఛైర్మెన్ స్థాయి పోస్ట్‌కే పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది.

# గొంతెండుతోంది... గుక్కెడు నీళ్ళివ్వండి!

**- కమిషనర్‌కు ఎమ్మెల్యే కోటంరెడ్డి విజ్ఞాపన**



నెల్లూరు, కొత్తూరు, కల్లూరుపల్లి ప్రాంతాల్లో అనేకమంది ప్రజలు తాగేందుకు గుక్కెడు మంచినీరు దొరక్క విలవిలలాడుతున్నారని, పనులు మానుకుని మంచినీటి ట్యాంకర్ల కోసం ప్రజలు పడిగాపులు పడుతున్నారని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తూ, కార్పొరేషన్‌వారు వెంటనే ఈ సమస్యను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతాల్లో తీవ్రంగా వున్న మంచినీటి ఎద్దడిని శాశ్వత ప్రాతిపదికన నివారించాలంటూ వందలాదిమంది ప్రజలతో కలసి కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆరువేల సంతకాలతో కూడిన ఆ ప్రాంతాల ప్రజల విజ్ఞాపనలను కమిషనర్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మంచినీటి సమస్య నివారణకు స్థానిక కార్పొరేటర్‌లు, అన్ని రాజకీయపార్టీల నాయకులు అందరం కలసి కృషి చేశామని, కొంతమేరకు సమస్య పరిష్కారం అయ్యిందని, పూర్తిస్థాయిలో ఈ సమస్య పరిష్కారానికి అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. నెల్లూరులో త్రాగునీటి సమస్య పరిష్కారం కావాలంటే 82 లక్షల రూపాయల నిధులు కావాలని, కోట్లాది రూపాయల నిధులను మంచినీటి ట్యాంకర్లకు ఖర్చుచేసే బదులు కేవలం 82 లక్షలు కేటాయిస్తే ఈ సమస్య శాశ్వత ప్రాతిపదికన పరిష్కారమవుతుందని ఆయన సూచించారు.



# నెల్లూరు కబుర్లు

## జిల్లాకి వెంకయ్య

- **2న ఆత్మీయ అభినందన**



కేంద్రమంత్రి వెంకయ్య గురువారం (జూన్1) సాయంత్రం నెల్లూరొచ్చాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో వారసుడిని కోల్పోయిన నారాయణ కుటుంబాన్ని, అలాగే మరో ప్రమాదంలో మరణించిన బెజవాడ అనిల్‌కుమార్‌రెడ్డి కుటుంబసభ్యులను ఆయన పరామర్శించాడు.

జూన్ రెండవ తేదీ ఉదయం నెల్లూరు పెద్దపోస్టాఫీసులో పాస్‌పోర్టు సేవా కార్యాలయాన్ని ఆయన ప్రారంభిస్తాడు. ఈ సేవాకేంద్రం జిల్లాలో ఏర్పడడం నాయుడి పుణ్యమే. స్వర్ణభారత్ ట్రస్ట్, అక్షర పాఠశాలలో జరిగే పలు కార్యక్రమాలలో పాల్గొని సాయంత్రానికి నగరానికి చేరుకుంటాడు. సాయంత్రం విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఆత్మీయ అభినందన కార్యక్రమంలో వెంకయ్య పాల్గొంటాడు. ఐక్యరాజ్య సమితి ఆవాస పాలకమండలి అధ్యక్షుడిగా వెంకయ్యఎన్నికైన సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కె.వి.రత్నం, సీబ్రోస్ సుబ్బారెడ్డి, రవీంద్ర సన్నారెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పడ్డ ఆతిథ్య కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగబోతోంది.

3వ తేదీ ఉదయం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించి, శ్రీశ్రీ త్రిదండి చిన్నజియ్యర్ స్వామితో కలిసి చవటపాలెం గ్రామానికి వెళ్ళి అక్కడ జరిగే కార్యక్రమాలలో పాల్గొంటాడు.

### మహానాడులో...
## భారీగానే నెల్లూరు నేతలు



విశాఖలో మూడురోజుల పాటు(మే 27, 28, 29తేదీలు) జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడుకు నెల్లూరు జిల్లా నుండి తెలుగుదేశం నాయకులు భారీగానే హాజరయ్యారు. మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణలతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, స్థానిక సంస్థల ప్రతినిధులు, పార్టీ కమిటీలలో సభ్యులు దాదాపు వెయ్యిమందికి పైగానే మహానాడుకు వెళ్ళారు. మహానాడులో మంత్రుల సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణలకు ప్రసంగించే అవకాశం లభించింది. అలాగే మేయర్ అజీజ్ మైనార్టీల సంక్షేమంపై మాట్లాడాడు. జిల్లా నుండి వెళ్ళిన నాయకులు ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, ముఖ్యనాయకులతో ఫోటోలు దిగుతూ హల్‌చల్ చేశారు. ఈ సందర్భంగా మహానాడులో జిల్లా నుండి పార్టీకి 92లక్షల రూపాయలు విరాళాలు ప్రకటించారు. మంత్రి నారాయణ పదిలక్షలు ప్రకటించగా, మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మేయర్ అజీజ్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, పార్టీ నాయకులు కె.గంగాప్రసాద్‌లు తలా 5లక్షల లెక్కన ప్రకటించారు. మిగతా జిల్లా నాయకులు ప్రకటించిన విరాళాలు కలిపితే మొత్తం 92లక్షలు అయ్యాయి.

## సాయి సంకీర్తన ఆడియో సిడి విడుదల




సాయి సంకీర్తన ఆడియో సిడి విడుదల కార్యక్రమం ఇటీవల టౌన్‌హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వెంకటగిరి రాజా సర్వజ్ఞ యాచేంద్ర పాల్గొని సిడిని ఆవిష్కరించి మాట్లాడుతూ తెలుగువాడి సంస్కృతి, సాంప్రదాయం సంగీతంలో ఇమిడి ఉందని, అదే మనకు ప్రపంచస్థాయిలో గుర్తింపు గౌరవం అని అన్నారు. దాదాపు 30ఏళ్ళుగా సాయి భజనలు, కచేరీలు చేస్తూ ఆ అనుభవంతో ఆడియోను విజయభాస్కర్ అందించడం అభినందనీయమన్నారు. ఉదయం నుంచి జరిగిన సాయిబాబా పాటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. గీత రచయిత విజయభాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఎన్.ఆర్.చైతన్య భక్తి గీతాలకు సంగీత దర్శకత్వం వహించారు. ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, గీతా మాధురి, శ్రీనిధి, నందినితో పాటు విజయభాస్కర్ పాడిన పాటలను సిడిగా రూపొందించారు. ఈ సందర్భంగా గత పాతికేళ్ళుగా నెల్లూరు నగరంలోని వివిధ సాయిబాబా దేవస్థానాల్లో సాయి గానామృతం చేస్తున్న గాయనీమణి చక్రాల సరస్వతమ్మను ముఖ్యఅతిథులు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. వై.వి.రామిరెడ్డి, బి.రాజశేఖర్, మాగుంట ద్వారకానాథ్, డాక్టర్ అజయ్‌కుమార్, వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో నీటికి కటకట



చెంతనే పెన్నానది వున్నా నెల్లూరు నగరం దాహంతో అల్లాడుతోంది. నగరంలో తాగునీటి సమస్యలు రోజురోజుకీ అధికమవుతున్నాయి. నెల్లూరు చెరువులో 101కోట్లతో కట్టిన సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్, పెన్నానదిలో మున్సిపల్ బావులు వున్నా నగర ప్రజలకు తగినంత నీరు సరఫరా కావడం లేదు. మున్సిపల్ పైప్‌లైన్‌లలో అన్ని ప్రాంతాలకూ సక్రమంగా నీళ్లందడం లేదు. బావులు, బోర్లు అడుగంటిపోవడంతో నగరంలో వాణిజ్య, వ్యాపార సంస్థల వాళ్ళు మున్సిపల్ కొళాయిల కనెక్షన్ల ద్వారా వ్యాపార అవసరాలకు తాగునీటిని తోడేస్తున్నారు. నగర శివారు ప్రాంతాలైతే దాహార్తితో అల్లాడుతున్నాయి. మున్సిపల్ ట్యాంకర్లు తిరుగుతున్నా ప్రజలకు పూర్తిస్థాయిలో మంచినీళ్ళు అందడం లేదు. గత ఏడాది చివర్లో కూడా వర్షాలు లేకపోవడం నెల్లూరు పాలిట శాపంగా మారింది. వర్షాలు కురవక పెన్నానది ప్రవాహం చక భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. నగరంలో నెలకొన్న తాగునీటి ఎద్దడితో నీళ్ళ వ్యాపారం జోరందుకుంది. ఒక్కో ట్రాక్టర్ ట్యాంకర్ నీటిని 500రూపాయల లెక్కన అమ్ముతున్నారు. గత్యంతరం లేకపోవడంతో ఆయా కాలనీలలో అపార్ట్‌మెంట్స్ వాసులు, వ్యాపార సంస్థల వాళ్ళు ట్యాంకర్ల ద్వారానే నీళ్ళు కొనుక్కుంటున్నారు.

## డిజిపిఎస్ యంత్రాన్ని ప్రారంభించిన జేసీ



అధునాతన పద్ధతిలో భూములను సర్వే చేయడానికి ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన డిజిపిఎస్ యంత్రాన్ని నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ఇటీవల కలెక్టరేట్‌లోని గోల్డెన్ జూబ్లీ సమావేశ మందిర ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.18లక్షల విలువైన ఆ యంత్రం ద్వారా 45కి.మీ. పరిధిలో సర్వేచేసే అవకాశం ఉందన్నారు. ఈ పరికరం ద్వారా 30రోజుల్లో చేసే సర్వేను ఒకరోజులో చేయవచ్చన్నారు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్, జాతీయ రహదారులను ఈ పరికరంతో సర్వే చేయిస్తామని తెలిపారు. సర్వేశాఖ ఏడి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఏసి వాకర్స్ సేవలు అభినందనీయం



అవసరాలను ముందస్తుగా గుర్తెరిగి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మే27వతేదీ నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఏసి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎం.పి మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సమాజ అవసరాలకు తగ్గట్టుగా ఏసి వాకర్స్ పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నారని అన్నారు. సంఘ అధ్యక్షకార్యదర్శులు వేలూరు రంగారావు, స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 డిప్యూటి గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, ప్రసాద్, గఫార్, చంద్రమౌళి, రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోటంరెడ్డి గిరి జన్మదినం



గత నెల 29న నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి యువసేన ఆధ్వర్యంలో చిన్నపిల్లల విభాగంలో పండ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి యువసేన అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ నిండు నూరేళ్ళు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో జీవితాంతం ఉండాలని ఆకాంక్షించారు. రామాయణంలో రామలక్ష్మణులు ఎలా వుంటారో నేటి రామలక్ష్మణులుగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలు ఉంటారన్నారు.

ఈ కార్యక్రమంలో వైయస్సార్ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి యన్.మదన్ కుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి యువసేన ప్రధాన కార్యదర్శి స్పందన్‌కుమార్, నగర అధ్యక్షులు శేషు, నవీన్, సిరాజ్, ప్రవీణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రైనీ కలెక్టర్‌గా మహేష్

నెల్లూరుజిల్లా ట్రైనీ కలెక్టర్‌గా ఆర్. మహేష్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నల్గొండ జిల్లాకు చెందిన ఈయన 2016లో సివిల్స్ సర్వీసుకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో ట్రైనీ కలెక్టర్‌గా జిల్లాలో ఆరు నెలలు విధులు నిర్వహించనున్నారు. సోమవారం గ్రీవెన్స్ సెల్, వివిధ సమావేశాలలో పాల్గొన్నారు.

## స్టాండింగ్ ఏకగ్రీవం

నెల్లూరు నగరపాలకసంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఇక లాంఛనం కానుంది. స్టాండింగ్ కమిటీలో ఐదుగురు సభ్యులను ఎన్నుకోవాల్సి వుండగా ఆరుగురు కార్పొరేటర్లు నామినేషన్ దాఖలు చేశారు. వీళ్లంతా అధికార తెలుగుదేశం కార్పొరేటర్లే! అయితే తెలుగుదేశం పెద్దలు నచ్చజెప్పడంతో కార్పొరేటర్ ప్రశాంత్‌కుమార్ తన నామినేషన్ ఉపసంహరించుకున్నాడు. దీంతో మామిడాల మధు, మన్నెం పెంచలనాయుడు, మల్లెబోయిన వెంకటేశ్వర్లు, బూదూరు ప్రశాంత్‌కిరణ్, నెల్లూరు సునీతలు రంగంలో వున్నారు. వీరి ఎన్నిక లాంఛనమే. ఈనెల 3వతేదీ అధికారికంగా వీరు ఎన్నికైనట్లు ప్రకటించనున్నారు.

## రంజాన్ మాసం ప్రారంభం

ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాసం మే 28వ తేదీ నుండి మొదలైంది. రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు ప్రార్థనల కొరకు నగరంలోని అన్ని మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 27వ తేదీ రాత్రి నెలవంక దర్శనంతో ముస్లింలు ఆనందోత్సాహాలకు లోనయ్యారు. ఈ నెలంతా కూడా ముస్లింలు ఎంతో నిష్ఠగా ఉపవాసాలతో, దైవభక్తితో గడుపుతారు.

## డాబాలో గొడవ

గత నెల 28వ తేదీ రాత్రి నెల్లూరు, గొలగమూడి రోడ్డులోని ఓ డాబా వద్ద ఘర్షణ చోటుచేసుకుంది. బీహార్‌కు చెందిన లారీ కార్మికులకు, డాబా సిబ్బందికి మధ్య బిల్లు చెల్లింపు విషయంలో తీవ్ర ఘర్షణ జరిగింది. రక్తం కారుతున్న ఓ వ్యక్తి వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. డాబాల వద్ద మద్యం అమ్మకూడదని నిబంధనలున్నాయి. కాని అవి అమలు కావడం లేదు. దానివల్లే ఈ గొడవలు.

# ఇసుక అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు

## అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం



ఇసుక అక్రమ మైనింగ్‌ను ఉపేక్షించవద్దని, అనుమతిలేని ఇసుక రీచ్‌లలో ఎవరైనా మైనింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. గత నెల 27న తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై ఇసుక మైనింగ్ వివరాలను సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా అధీకృతంగా గుర్తించిన 28 ఇసుక రీచ్ లలో ఇసుక మైనింగ్ చేసుకునేందుకు ఇబ్బంది లేదని, అయితే అనుమతిలేని ఇసుక రీచ్‌లలో మైనింగ్ చేసినట్లయితే అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఆయా వాహనాలను సీజ్ చేయడంతో పాటు, అక్రమంగా మైనింగ్ చేసినందుకు లక్ష రూపాయల పెనాలిటీతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ విషయంలో రెవిన్యూ, పోలీస్, రవాణా శాఖ, మైనింగ్‌శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అక్రమ మైనింగ్‌లకు పాల్పడిన వాహనాల నెంబర్లను ఎప్పటికప్పుడు కలెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు. ఆ వాహనాలు ఎన్నిసార్లు అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డాయో ఆ వివరాలు కూడా తెలియజేయాలన్నారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటసుబ్బయ్య, నెల్లూరు, గూడూరు, నాయుడుపేట, ఆత్మకూరు ఆర్డీఓలు కె.వెంకటేశ్వర్లు, అరుణబాబు, వి.కె శీనానాయక్, బాపిరెడ్డిలతో పాటు పలువురు డిఎస్పీలు, రవాణా, రెవిన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**నెల్లూరు నాలుగో నగర సిఐగా వున్న సీతారామయ్యను ఇటీవల విఆర్‌కు పంపుతూ గుంటూరు రేంజ్ ఐజి సంజయ్ ఉత్తర్వులు జారీ చేయడం తెలిసిందే! సిఐ సీతారామయ్య బదిలీకి సంబంధించి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మీద కొందరు బురద చల్లుతున్నారు. జరగనిదానిని జరిగినట్లు, అననిదానిని అన్నట్లు చిత్రీకరిస్తూ సోమిరెడ్డిని వివాదంలోకి లాగే ప్రయత్నం చేశారు.**



# మంత్రిపై బురద చల్లారు

ఇటీవల నెల్లూరు కోనేరు స్థలంలో కట్టిన రోడ్డు మార్జిన్ వ్యాపారుల మార్కెట్ సముదాయం ప్రారంభోత్సవానికి ఇతర మంత్రులతో పాటు జిల్లా మంత్రిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా హాజరయ్యారు. అయితే మంత్రులు అక్కడకు వచ్చే సమయానికి నాలుగో నగర పరిధిలో ఎక్కడో గొడవ జరుగుతుందనే సమాచారం వచ్చేసరికి ఎస్‌ఐలను ఇక్కడ పెట్టి సిఐ సీతారామయ్య అక్కడకు వెళ్లిపోయాడు. కార్యక్రమానికి వచ్చిన మంత్రికి ప్రోటోకాల్ ప్రకారం ఉండాల్సిన సిఐ కనిపించలేదు. మంత్రులు కార్యక్రమం ముగించుకుని వెళ్లబోతుండగా సిఐ సీతారామయ్య అక్కడకు వచ్చాడు. ఏమయ్యా, మంత్రి వస్తే రావాలని తెలియదా అని సోమిరెడ్డి సిఐని నిలదీసాడు. ఫలానా చోట తన్నుకుంటున్నారని ఫోన్ వస్తే వెళ్లాను సార్ అని సిఐ చెప్పాడు. అయినా రెండుగంటల సేపు తన్నుకుంటున్నారా... అని సోమిరెడ్డి నిలదీసి, ఆ తర్వాత ఆయన పాటికి ఆయన వెళ్లిపోయి ఐజికి సిఐ వ్యవహారశైలి మీద ఫిర్యాదు చేయడంతో ఆయన బదిలీ జరిగిపోయింది. దీంతో జరిగిన వాదనలకు కొందరు మసిపూసారు. రెండు గంటలు తన్నుకుంటున్నారా అని మంత్రి అన్న మాటను సిఐను తంతానన్నట్లుగా సృష్టించారు.

నెల్లూరుజిల్లా రాజకీయాల్లో అధికారులను 'తంతాను' అనే సంస్కృతి ఎప్పుడూ లేదు. ఏ పార్టీ నాయకుడైనా సరే అధికారులతో మర్యాదగానే మాట్లాడతారు. నాయకులు రాజకీయంగా ఒకరిపై ఒకరు ఎన్ని విమర్శలు చేసుకున్నా అధికారులతో మాత్రం సభ్యతతో వ్యవహరిస్తారు. ఈ జిల్లాలో ఇద్దరు, ముగ్గురు నాయకులు తప్ప అధికారుల పట్ల నోటి దురుసుతో వ్యవహరించే వాళ్లెవరూ లేరు. మంత్రి సోమిరెడ్డి అధికారులపై ఆగ్రహం వచ్చినప్పుడు వారిని మందలించే విధానం సంస్కారవంతంగానే వుంటుందిగాని ఇంత నాటు మాటలతో తిట్టడు. ఈరోజు ఆయన కొత్తగా మంత్రి కాలేదు... అది చూసుకుని మిడిసి పడడానికి. గతంలో రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేసినవాడే! మన్ననలు పొందినవాడే! ముఖ్యంగా పోలీసు శాఖలో చాలామంది అధికారులతో ఆయనకు స్నేహసంబంధాలున్నాయి కూడా! అలాంటి నాయకుడు 'తంతాను' అంటూ ఒక సిఐ మీద నోరు జారడంటే ఆయన గురించి తెలిసిన వారెవరూ నమ్మరు.

ఇక సిఐ సీతారామయ్య గతంలో 5వ నగరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేసినప్పుడు ఎవరి మాటా వినడు ఈ సీతయ్య అన్నట్లు పేరు తెచ్చుకున్నాడు. ఆ స్టేషన్ పరిధిలో అరాచక శక్తుల ఆటకట్టించాడు. నాల్గో నగర సిఐగా వచ్చాకే కొద్దిపాటి ఆరోపణలు ఎదుర్కోవాల్సి వచ్చింది. నెల్లూరు నాలుగో నగర స్టేషన్ అంటే అంతేనేమో!ఎలాంటి ఆఫీసర్ అయినా ఇక్కడ ఆరోపణలు ఎదుర్కోక తప్పదు.

# శ్రీ సిటిలో వైటల్ పేపర్ ప్యాకేజింగ్ పరిశ్రమ

శ్రీసిటి సెజ్‌లో మరో పరిశ్రమ గత నెల 27న తమ ఉత్పత్తులను ప్రారంభించింది. సింగపూర్ దేశానికి చెందిన వైటల్ పేపర్ ప్రోడక్ట్స్ తమ మూడవ పరిశ్రమను నెల్లూరుజిల్లా తడ మండలంలోని శ్రీసిటి సెజ్‌లో ప్రారంభించింది. ఇప్పటికే ఈ సెజ్‌లో రెండు యూనిట్లు కలిగిన ఈ పరిశ్రమ మూడవ యూనిట్‌ను సైతం ఇక్కడ నెలకొల్పడం విశేషం. ఇందులో స్టేషన్ ఆఫీస్, పాఠశాల స్టేషనరి, తదితర పేపర్ ప్రోడక్ట్స్‌ను తయారు చేయనున్నారు. ఈ పరిశ్రమను ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శశిరవడ లాంఛనంగా ప్రారంభించారు. నెలకు 3వేల మెట్రిక్ టన్నుల బాక్సుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ యూనిట్‌ను మరింతగా విస్తరింపజేస్తామని పరిశ్రమ జనరల్ మేనేజర్ ప్రదీప్‌దేశ్‌పాండే తెలిపారు.


# Dr. BEZAWADA GOPALA REDDY WOMEN'S ACADEMY



Sri Kasthuridevi Vidyalaya Campus

Estd: 1997
(A Degree College for Women)
Dargamitta, Nellore. Ph: 9052171442, 9704646196

Affiliated to Vikrama Simhapuri University, Nellore.

- A flagship institution that served the cause of education exclusively for girls for two decades.
- Tools to speak English with ease & comfort.
- A platform to create connectivity to MNC, for placement.
- Committed and sincere faculty with vast experience.
- Honing Skills for coping with modern complexities.
- The campus is rich with lush greenary tall trees and serene atmosphere.
- Well equipped labs and air - conditioned library.
- To promote passion for acquisition of knowledge.
- Promotes leadership and ethical value system.
- Group Discussion
- Interface with leaders from different walks of life.
- The environment and entrance lush green, tall trees.
- Encourages interaction fellowship among students.
- The pass percentage and ranks are as good as ever; second to none.
- The faculty-full timers committed to share knowledge and information.
- Safety & security are perfect incident free.

WE STRIVE FOR EXCELLENCE

COURSES OFFERED

**B.Sc., B.Com**

- B.Com - Computer Applications
- B.Sc. : Mathematics - Statistics - Computer Science
- B.Sc. : Bio - Technology - Chemistry - Computer Applications

**INTRODUCING NEW COURSES FROM THE ACADEMIC YEAR 2017-18**

- B.Sc. : Bio-Technology - Zoology - Chemistry
- B.Sc. : Micro Biology - Bio-Chemistry - Chemistry
- B.Sc. : Micro Biology - Zoology - Chemistry

*For Admission Contact Principal's Office*

**V. MRUDULA,** Principal

**J.V. REDDY,** Secretary & Correspondent

# గూడూరు డివిజన్ వార్తలు

## ప్రయాణీకుల సేవే పరమార్థం



పార్శిల్‌బుకింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శశిధర్

రాష్ట్రంలో ఆర్టీసీకి లాభాలను సమకూర్చుడంలో ప్రయాణీకుల సేవలు అధికం చేస్తున్నట్లు ఆర్టీసీ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శశిధర్ అన్నారు. ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించి లాభాల బాటలో తీసుకెళ్ళేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. గూడూరు ఆర్టీసీ పాతబస్టాండ్‌లో కార్గోసర్వీసు సేవలను (పార్శిల్ బుకింగ్ కేంద్రాన్ని) ఆయన ఆర్టీసీ అధికారులతో కలసి ఆదివారం ప్రారంభించారు. తొలుత పాతబస్టాండ్ వద్ద సిటీఎం కృష్ణారావు తదితరులు నూతనంగా ఏర్పాటు చేసిన కార్గో సర్వీసు కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం డిపో ప్రాంగణంలో ఆర్టీసీ సిబ్బంది, కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీ టిక్కెట్ ద్వారా ఆదాయంతో పాటుగా కమర్షియల్ ఆదాయంలో రూ. 150కోట్లు రాగా అందులో పార్శిల్ విభాగం ద్వారా రూ. 15కోట్లు ఆదాయం సమకూరినట్లు చెప్పారు. సిబ్బంది అందరూ సమిష్టిగా పనిచేయడం వలన ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ఆర్టీసీ యూనియన్ నాయకులు, కార్మిక సంఘ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాకొద్దుబాబు మద్యం దుకాణాలు

గూడూరు రెండో పట్టణం మాలవ్యా నగర్‌లో నూతనంగా మద్యం దుకాణానికి ఏర్పాట్లు చేస్తున్నారని, మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల అక్కడ నివసించే కుటుంబాల మహిళలు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులకు ఇబ్బందికరంగా ఉంటుందని శ్రీరామరక్ష కుటీర నిర్వాహకులు, స్థానికులు వై.చిట్టిబాబు అన్నారు. మద్యం దుకాణాన్ని మాలవ్యానగర్‌లో కుటుంబాలు నివాసముండే దగ్గర ఏర్పాటు చేయడం నిషేధించాలని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో అరుణ్‌బాబుకు స్థానికులతో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకర్లతో వారు మాట్లాడుతూ మాలవ్యానగర్ ప్రాంతంలో అనేకమంది ప్రజలు నివాసం వున్నారని, ఇప్పటికే మాలవ్యానగర్ కళాశాల ప్రాంతంలో ఒక మద్యం దుకాణం ఉందని, దానివల్లే కళాశాలకు వెళ్ళే విద్యార్థినీ విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, మళ్లీ మరొక మద్యం దుకాణం ఏర్పాటు చేసి ప్రశాంతంగా ఉన్న స్థానికులను తంటాలు పడేలా చేయకుండా అధికారులు, పాలకులు చూడాలని తెలిపారు. మద్యం దుకాణాలను మాలవ్యానగర్‌లోని ఇళ్ల మధ్య కాకుండా ఎక్కడైనా ప్రజలకు



ఆర్డీవో అరుణ్‌బాబును కలసి వినతిపత్రం ఇస్తున్న చిట్టిబాబు తదితరులు

ఇబ్బంది లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకొనేలా అధికారులు చొరవ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో ఆడిటర్ ఎస్. రామ్మోహన్‌రావు, స్థానికులు పాల్గొన్నారు.

## జంతుశాస్త్ర అయ్యోరు నాగేంద్రకి పిహెచ్‌డి



గూడూరు పట్టణం తిలక్‌నగర్ ప్రాంతానికి చెందిన జంతుశాస్త్ర అధ్యాపకుడు ఎస్.వి.నాగేంద్రప్రసాద్‌కు తిరుపతి లోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పిహెచ్‌డి ప్రదానం చేసినట్లు తెలిపారు. ప్రొఫెసర్ ఎం.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన వైవా ఓసీలో సమర్పించిన పరిశోధనాత్మక వ్యాసానికి డాక్టరేట్ అందించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నాగేంద్రప్రసాద్ జిల్లాలోని ఉదయగిరి ప్రభుత్వ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకులుగా కొనసాగుతున్నారు. గూడూరు ఎస్‌కెఆర్ ప్రభుత్వ కళాశాలలో కూడా గత రెండు దశాబ్దాలుగా పని చేశారు.

# అక్షరాన్ని ఆయుధంగా మలచిన మహాకవి శ్రీశ్రీ

### శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన “శ్రీశ్రీ పురస్కారం-2017” ప్రదానోత్సవ కార్యక్రమం

- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సినీ రచయిత భువనచంద్ర ఉపన్యాసం
- జీవన ప్రయాణాన్ని ప్రేక్షకులతో పంచుకున్న పురస్కార గ్రహీత విశ్వేశ్వరరావు



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఏటా అందిస్తున్న శ్రీశ్రీ పురస్కారం ఈ సంవత్సరం విజయవాడకి చెందిన సాహితీమిత్రుడు, శ్రీశ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావుకి అందజేశారు. మే 28వ తేదీ ఆదివారం సాయంత్రం నెల్లూరు రేబాల లక్ష్మీ నరసారెడ్డి స్మారక మందిరంలో ఈ పురస్కార సభ జరిగింది. చిన్ని నారాయణరావు అధ్యక్షత వహించిన ఈ సభకు విశిష్ట అతిథిగా విచ్చేసిన సినీ రచయిత భువనచంద్ర ఉప న్యాసం ఆద్యంతం ప్రత్యేక ఆకర్షణగా సాగింది.

ముందుగా సభాధ్యక్షుడు చిన్ని నారాయణరావు మాట్లాడుతూ అక్షరాలను శక్తివంతంగా మలిచి సమాజానికి దిశానిర్దేశం చేసిన మహాకవి శ్రీశ్రీ పేరుతో ఏటా ఒక పురస్కారాన్ని తమ సంఘం ద్వారా అందించడం నెల్లూరుకు గర్వకారణం అన్నారు. తమ సంస్థ ద్వారా అందిస్తున్న ఈ పురస్కారం గత సంవత్సరం శ్రీశ్రీ రచనలపై విశేష కృషి చేసిన సింగంపల్లి అశోక్‌కుమార్‌కి అందించామని, ఈ సంవత్సరం ఈ అవార్డును విజయవాడ లోని శ్రీశ్రీ ప్రింటర్స్ అధినేత, శ్రీశ్రీ ఆరాధకుడు విశ్వేశ్వరరావుకు ఇస్తున్నామన్నారు.

శ్రీశ్రీ జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆయన భావాలను, ఆశయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేస్తున్న విజయవాడకు చెందిన శ్రీశ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావు, ఆయన సతీమణి శ్రీమతి ప్రమీల లను సంస్థ తరపున అతిథులు సత్కరించారు.

అనంతరం సినీ రచయిత, విశ్వేశ్వరరావు చిరకాల మిత్రుడు భువనచంద్ర మాట్లాడుతూ శ్రీశ్రీ గురించిన తన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ మొదటి సారిగా చెన్నై పాండీ బజారు బస్‌స్టాప్‌లో 12బి బస్ కోసం ఎదురుచూస్తున్న శ్రీశ్రీని తాను పలకరించి పరిచయం చేసుకున్నప్పుడు నిప్పుల్లాంటి అక్షరాలను తన చేతులనుండి కురిపించే శ్రీశ్రీ తనని ఆప్యాయంగా పలకరించడం ఆయన సున్నిత స్వభావానికి చిహ్నం అని పేర్కొన్నాడు. శ్రీశ్రీ రాసిన ఒక సినిమా పాట ‘మనసున మనసై బ్రతుకున బ్రతుకై’ పాడుతూ నిన్ను నిన్నుగా ప్రేమించే వ్యక్తి తోడును, ఉత్కృష్టమైన ప్రేమ భావనను ప్రపంచానికి శ్రీశ్రీ పరిచయం చేసాడని కొనియాడాడు. అనువాద పాటలకు ట్యూన్ ఒక వారధి అనీ, ఏ ఒరిజినల్ ట్యూన్‌లో అయినా ఒదగగలిగే పదాలను అలవోకగా అల్లి, భావాన్ని చెడగొట్టకుండా పాటలను రాసిన శ్రీశ్రీ ఈనాటి తరానికి మార్గదర్శకుడుగా నిలిచాడన్నాడు. శ్రీశ్రీ పురస్కార గ్రహీత విశ్వేశ్వరరావుతో తనది నాలుగు దశాబ్దాల పరిచయమని ఈ సందర్భంగా నెల్లూరుకు వచ్చి శ్రీశ్రీ గురించి నాలుగు మాటలు పంచుకునే అవకాశం కలిగినందుకు సంతోషంగా ఉందన్నాడు.

ముఖ్యఅతిథిగా విచ్చేసిన లాయర్ వారపత్రిక సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ మహాకవి శ్రీశ్రీ పేరుతో ఏటా ఒక పురస్కారం అందించడం ద్వారా శ్రీశ్రీ తన కవిత్వం ద్వారా సమాజానికి అందించిన చైతన్యాన్ని గుర్తు చేసుకున్నట్టు అవుతుందని, నెల్లూరులో జరిగే అనేక పురస్కారాలలో ఇదో గొప్ప కార్యక్రమంగా నిలుస్తుందని అన్నారు. శ్రీశ్రీ సినిమారంగంలోకి ఎలా ప్రవేశించాడో వివరిస్తూ మల్లెమాల తన ఆత్మకథలో రాసిన పలు విషయాలను ప్రేక్షకులకు వివరించాడు. శ్రీశ్రీ సినిమా పాటలు మొత్తంగా ఒక పుస్తకాన్ని ఎవరూ తీసుకుని రాలేదని అలా ఎవరైనా తెస్తే బాగుంటుందనీ సినీ రచయిత భువనచంద్ర తన ఆకాంక్షను వెలిబుచ్చగా అందుకు తుంగా శివప్రభాత్ రెడ్డి స్పందిస్తూ ఎవరైనా శ్రీశ్రీ సినిమా పాటలు మొత్తం సేకరించి ఇస్తే తమ సంస్థ తరపున ఆ పుస్తకాన్ని ముద్రిస్తానని ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య ప్రకటించాడు.

‘కవిత’ పత్రికను నిర్వహిస్తున్న కవి బండ్ల మాధవరావు మాట్లాడుతూ శ్రీశ్రీ విశ్వేశ్వరరావును తాను గత 17సంవత్సరాలుగా చూస్తున్నానని చెబుతూ ఆయనతో తనకున్న స్నేహంతోపాటు అనేక అనుభవాలను వివరించాడు. విశ్వేశ్వరరావు కాస్త నిర్ద్వందంగా కటువుగా మాట్లాడతాడనే ప్రచారం ఉందనీ, అయితే అది ఆయన భావ వ్యక్తీకరణ స్వభావం మాత్రమే అనీ అన్నాడు. ఆయన చాలా సున్నితమైన స్వభావి అని ఆయన అక్షరాన్ని, పుస్తకాన్నీ ఎంతగా ప్రేమిస్తాడో తెలిస్తే అర్థం అవుతుందనీ అన్నాడు.

అనంతరం శ్రీశ్రీ పురస్కార గ్రహీత విశ్వేశ్వరరావు మాట్లాడుతూ తనకు నెల్లూరుతో గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నాడు. కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య పరిచయం ద్వారా తాను మార్క్సిస్ట్ రాజకీయాలను నేర్చుకుని ప్రాపంచిక జ్ఞానం అవగాహన చేసుకోగలిగానని అన్నాడు. తనకు చదువు అబ్బనందుకు తండ్రి ఇంటినుంచి పొమ్మనడం, తాను స్వతంత్ర భావాలను ఏర్పరచుకొన్న తీరును, జీవితంలో ఎదురైన అనేక అనుభవాలను విశ్వేశ్వర రావు ప్రేక్షకులతో పంచుకున్నాడు. శ్రీశ్రీతో తనకు గల అనుభవాలు అనేకం నెమరు వేసుకుంటూ శ్రీశ్రీ ప్రింటర్స్ పేరుతో తమ కుటుంబంతో పాటుగా పదిమంది బతకగలగడం తప్ప తన ప్రత్యేకత ఏమీ లేదనీ వినమ్రంగా తనని తాను ఆవిష్కరించుకున్నాడు.

సభ ప్రారంభంలో సంస్థ గౌరవాధ్యకుడు ఈదూరు సుధాకర్ నిర్వహణలో పాతికమందికి పైగా కవులు, కవయిత్రులు శ్రీశ్రీ భావజాలం పై తమ కవితలను చదివి వినిపించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రచయితల సంఘం కార్యదర్శి ఈతకోట సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఏటూరు నాగేంద్ర, దగ్గుమాటి పద్మాకర్, బొగ్గవరపు రాధాకృష్ణ మూర్తి, వంజవాక సతీష్ కుమార్ తదితరులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మహానాడులో మాంత్రికులు

శ్రీను గల్పిక

అది విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్శిటీ ప్రాంగణం. తెలుగుదేశం పార్టీ మూడురోజుల మహానాడు ఉత్సవాలకు ఆ ప్రాంగణం ముస్తాబౌవుంది. విజయవాడ నుండి బయలుదేరిన హైటెక్‌రత్న, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అప్పుడే విశాఖ ఎయిర్‌పోర్టులో దిగారు. మంత్రులు గంటా శ్రీనివాసరావు, చింత కాయల అయ్యన్నపాత్రుడు, సుజయ్‌కృష్ణ రంగారావులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. చంద్రబాబు కాన్వాయ్ బయలుదేరి ఆంధ్ర యూనివర్శిటీ వద్ద ఆగింది. చంద్రబాబు కారు దిగాడు. అక్కడున్న స్వాగత ద్వారాన్ని చూసాడు. కెవ్... అంటూ అరిచాడు. మిగతా నాయకులు హడలిపోయి ఏమైంది సార్ అంటూ చంద్రబాబును గట్టిగా పట్టుకున్నారు. ఆయన తేరుకుని... ఏంటిది, మహానాడు స్వాగత ద్వారమా, లేక దెయ్యాల దిబ్బ స్వాగత ద్వారమా? అని ప్రశ్నించాడు. అక్కడ ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం మీద ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేష్‌ల ఫోటోలు లేవు. భూతాలు, రక్తపిశాచాల బొమ్మలతో ఒక పెద్ద రాక్షస గృహ మాదిరిగా అక్కడ స్వాగత ద్వారం వుంది. దాన్ని చూసే చంద్రబాబు భయపడ్డాడు. నేను కాబట్టి సరిపోయింది, దేవాన్ష్‌ను నా వెంట తీసుకుని వచ్చుంటే ఈ గృహను చూసి ఎంత భయపడి వుండేవాడు అని చంద్రబాబు అరిచాడు. అందుకు గంటా శ్రీనివాస్‌రావు వుండి... ఆంధ్రా యూనివర్శిటీ దెయ్యాలకొంప అని మన ఎమ్మెల్సీ ఎంవివిఎస్ మూర్తి గారే అన్నారుకదా సార్, ఈ దెయ్యాలకొంపలో మనం మహానాడు ఏర్పాటు చేస్తిమి, దెయ్యాల కొంపకు తగ్గట్లుగానే మనం స్వాగత ద్వారాలు, స్వాగత ఏర్పాట్లు చేసామని అన్నాడు. మీ తెలివి తెల్లారినట్లే వుంది, ఆయన ఏదో దెయ్యాలకొంప అన్నాడని చెప్పి మీరు దాన్ని ఆచరణలో పెడతారా అంటూ చంద్రబాబు లోపలకు అడుగుపెట్టాడు. అంతే 'బాలనాగమ్మ' సినిమాలో మాయలఫకీర్ లాగా వున్న ఇద్దరు వ్యక్తులు చేతిలో ఎముకలు, మెడలో పుర్రెల దండతో 'ఓం శాకిని.. ఓం ఢాకిని.. ఓం మందాకిని' అని మంత్రాలు చదువుతూ చంద్రబాబు ముఖాన బూడిద చల్లారు. ఓర్నీ దుంపతెగ, ఎవర్రా వీళ్ళు అని చంద్రబాబు అరిచాడు. మన పార్టీ నాయకులే సార్, సెట్టింగ్‌కు తగ్గట్లుగా సీన్ వుండాలని మీకు వీళ్ల చేత స్వాగతం పలికించే ఏర్పాట్లు చేయించానని చింతకాయల అయ్యన్నపాత్రుడన్నాడు. మీ ముఖాన మజ్జిగపులుసు పొయ్యా... ఎవరన్నా మంచి పాటలతో, సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలుకుతారు, ఇలా స్వాగతం పలికితే మహానాడుకు వచ్చేవాళ్ళు కూడా బెదిరిపోతారని చంద్రబాబు అని, సభా ప్రాంగణంలోకి అడుగుపెట్టాడు. అక్కడ స్టేజీ, ఇతర ఏర్పాట్లు చూసి చంద్రబాబు నిలువెల్లా వణికి పోయాడు. సభా ప్రాంగణమంతా 'అరుంధతి', 'జగన్మోహిని', 'కాంచన', 'ప్రేమ కథా చిత్రమ్', 'డాకిని', 'దెయ్యాలదిబ్బ', 'చంద్రముఖి', 'త్రిపుర', 'గీతాంజలి' వంటి సినిమాల ఫ్లెక్సీలతో అలంక రించి వున్నారు. చంద్రబాబు సభా ప్రాంగణం వైపు చూసాడు. కుర్చీలన్నీ ఖాళీగా వున్నాయి. చంద్రబాబు వారితో... మనం మహానాడు చేస్తున్నట్లుగా లేదు, ఏదో హారర్ సినిమా చేస్తున్నట్లుగా వుంది, మీరు కట్టించిన ఫ్లెక్సీల దెబ్బకు కార్యకర్తలు రాలేదు చూడండి, మహానాడు సభా ప్రాంగణం అంటే ఎంత కళగా వుండాలి, సభాప్రాంగణం మొత్తం పసుపుమయం కావాలి. ఎటుచూసినా పసుపు జెండాల రెపరెపలుండాలి. కాని మీరు ఎటుచూసినా చంద్రముఖి, అరుంధతి, పశుపతి, గీతాంజలి చిత్రాలు కనిపించేలా చేసారు. ఇది మహానాడు అనుకుం టున్నారా, ఇంకేమన్నా అనుకుంటున్నారా? అని ఆవేశంగా అడిగాడు. అందుకు గంటా సమాధానమిస్తూ... మాకేం తెలుసు సార్, ఎంవివిఎస్ మూర్తి గారు ఆంధ్ర యూనివర్శిటీని దెయ్యాల కొంప అని చెప్పారాయె, మీరు మహానాడును ఇక్కడే డిసైడ్ చేస్తిరి, ఈసారి మహానాడును దెయ్యాలకొంపలా వెరైటీగా ప్లాన్ చేసారని మేమనుకున్నాము. అందుకే దానికి తగ్గట్లుగా ఏర్పాట్లు చేసామని చెప్పాడు. చంద్రబాబు వారితో... మీకు పుణ్య ముంటుంది, ఈ సెటప్ అంతా ఎత్తేయండి, దెయ్యాల సెట్టింగ్‌లు చూసే కార్యకర్తలు రావడం లేదు. ముందు ఇవన్నీ ఎత్తేయండి, ఈ హీరోయిన్ దెయ్యాల కటౌట్‌లు తీసేసి ఎన్టీఆర్‌వి పెట్టండి, ప్రాంగణాన్ని పసుపు జెండాలతో అలంకరించండి, రేపు మహానాడుకు జనం దండిగా రావాలి, ఏం చేస్తారో నాకు తెలియదని చంద్రబాబు వెళ్లిపోయాడు. ఈ దెయ్యాల కటౌట్‌ల దెబ్బకు కార్యకర్తలంతా జడుసుకునిపోయారు. రేపు మహా నాడుకు జనాన్ని ఎలా తీసుకురావాలబ్బా అని గంటా శ్రీని వాసరావు తలపట్టుకుని కూర్చున్నాడు. అప్పుడే 'ఏం బాలకా... అలా దిగులుగా కూర్చున్నావ్' అని ఓ కంఠం ప్రశ్నించింది. గంటా తలెత్తి చూసాడు. 'పాతాళభైరవి' సినిమాలో మాంత్రికుడిలా ఓ వ్యక్తి అక్కడ నిలబడివున్నాడు. ఎవర్నువ్వు అని గంటా అడిగాడు. ఓర్నీ పాసుగాలా నన్ను గుర్తు పట్టలేదా అని ఆ వ్యక్తి పెట్టుడుగడ్డం తీసేసాడు. గంటా ఆశ్చర్యంగా వివేకన్నా... మీరా... అని అడిగాడు. అవును నేనే స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకాను, మీ సెట్టింగ్‌కు తగ్గట్టు ఈ గెటప్‌లో వచ్చానన్నాడు. ఏం సెటప్‌లో ఏం గెటప్‌లో... సీఎం చీవాట్లు పెట్టిపోయాడు. రేపు జనాన్ని దండిగా తీసుకురమ న్నాడు. ఎలా తీసుకురావాలో అర్థం కావడం లేదని గంటా వాపోయాడు. అది విన్న వివేకా... అదేం పెద్ద సమస్య కాదు, ఆ సంగతి నాకు వదిలేయ్ అని గంటాకు భరోసా ఇచ్చాడు.

★★★★★

పక్కరోజు మహానాడు ప్రాంగణం కార్యకర్తలతో కిక్కిరిసి పోయింది. ఒక్కో కుర్చీకి ముగ్గురు కార్యకర్తలు పోటీ పడసాగారు. సభాప్రాంగణానికి చేరుకున్న చంద్రబాబు వచ్చిన జనాన్ని చూసి సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాడు. సభలో అందరు నాయకుల ప్రసంగాలు, తీర్మానాలు అయిపోయాక చంద్రబాబు గంటా శ్రీనివాస రావు వద్దకు వచ్చి... ఏం చేసావు శ్రీనివాస్ ఇంతమంది జనం వచ్చారని అడిగాడు. ఇందులో నా గొప్పతనమేమీ లేదు. అంతా వివేకన్న దయ అంటూ అక్కడే వున్న వివేకాను చూపించాడు. ఏం చేసావ్ వివేకా అని చంద్రబాబు అడిగాడు. అందుకు వివేకా... ఏముంది సార్, మహానాడు ముగిసాక విశాఖ బీచ్‌లో 'లవ్‌బీచ్ ఫెస్టివల్' ఉం టుందని మీడియాలో ప్రచారం చేయించాను, అందుకే జనం విరగబడి వచ్చారన్నాడు. ఆ మాటకు చంద్రబాబు ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

---

## రాశి - మీ వాసి



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 2.6.2017 నుండి
తేది. 8.6.2017 వరకు

ఈ వారం మేషంలో బుధశుక్రులు, వృషభంలో రవి మరియు 3తేది నుండి బుధుడు, మిధునంలో కుజుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, ధనుస్సులో శని, కుంభంలో కేతువు, సింహ కన్య తుల వృశ్చిక రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము

#### ముహూర్తములు

తేది 4.6.2017 ఆదివారం ఉదయం గంట 8.34 నుండి 10.44లోగా కర్కాటక లగ్నమున ఉపనయన, వివాహ అన్నప్రాశన, వ్యాపార, విద్యారంభ, కేశఖండనములు. తేది. 8.6.2017 గురువారం ఉదయం 8.20 నుండి 10.30లోగా కర్కాటక లగ్నమున వ్యాపార, వివాహములు. రాత్రి గంట 9.12 నుండి 11.16లోగా మకర లగ్నమున గృహప్రవేశ, వివాహములు.

#### జ్యేష్ఠ మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 2 | శుక్ర | అష్టమి | ప॥ గం.10.38వ॥ |
| తేది. 3 | శని | నవమి | ఉ॥ గం.10.15వ॥ |
| తేది. 4 | ఆది | దశమి | ఉ॥ గం.10.22వ॥ |
| తేది. 5 | సోమ | ఏకాదశి | ఉ॥ గం.11.00వ॥ |
| తేది. 6 | మంగళ | ద్వాదశి | ప॥ గం. 12.08వ॥ |
| తేది. 7 | బుధ | త్రయోదశి | ప॥ గం.1.40వ॥ |
| తేది. 8 | గురు | చతుర్దశి | ప॥ గం.3.30వ॥ |

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఈ వారం ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలు కొద్దిపాటి అభివృద్ధిలో నుండి ఆదాయం తృప్తికరంగా ఉంటుంది. అనుకున్న పనులను ఓర్పుతో జరుపుకొనాలి. ఆర్థిక లావాదేవీలు రాజీకి వస్తాయి. కుటుంబ పరంగా కొన్ని ఖచ్చితమైన నిర్ణయాలు తీసి కొనాలి. శుభకార్యాలు నిర్వహించడం జరుగుతుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆర్థిక అంచనాలు పెరిగి ఖర్చులు పెరుగుతాయి. శుభకార్యాల ఖర్చులు అధికం. వృత్తి వ్యాపారాలు బాగా ప్రోత్సాహకరంగా ఉండి ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. గృహ వస్తువాహన రిపేర్లుంటాయి. ప్రయాణాలలో శ్రమ పడతారు. ఉన్నత విద్యావకాశాలు విద్యార్థులకు లభిస్తాయి. కొత్త పరిచయాలు కలుగు తాయి. ఆర్థికలావాదేవీలందు జాగ్రత్త అవసరం.

### మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థిక ఇబ్బందులు తప్పవు. ఖర్చులు పెరిగిపోతాయి. వృత్తిపరంగా బాగుండినా, వ్యాపార పరంగా ఇబ్బందు లుంటాయి. ఆదాయం సంతృప్తికరంగా ఉండదు. కొద్ది ఋణం చేయవలసి రావచ్చును. అనుకున్న పనులు నిదానంగా జరిగి కోపం, విసుగు కలుగుతుంది. ముఖ్య వస్తువులు జాగ్రత్త పరచుకొనండి. కార్య సమర్థత ఉండినా పనిచేయదు.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

చేపట్టిన పనులకు అనుకూలత బాగుంటుంది. ఉన్నత విద్యావకాశాలు లభించగలవు. వృత్తి వ్యాపారా లలో ప్రోత్సాహం బాగుండి ఆదాయం పెరుగుతుంది. అయితే అవసరాలకు కొద్దిపాటి ఋణం చేస్తారు. భాగస్వామి చర్చలు ఫలించగలవు. ఉద్యోగబాధ్యతలలో జాగ్రత్త అవసరం. శుభకార్యాలలో పాల్గొంటారు. అనవసర విషయాలలో తల దూర్చవద్దు.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆర్థిక లావాదేవీలు, ఇంటా బయటా వ్యవహారాలు ప్రోత్సాహకరంగా జరుగుతాయి. ఆదాయం సంతృప్తికరం. ఆర్థిక, ఉద్యోగావకాశాలు అప్రయత్నంగా జరుగును. పెట్టుబడులకు అనుకూలం. స్థిరాస్తులపై ఆదాయముం టుంది. వేడుకలు, శుభకార్యాలలో పాల్గొంటారు. ఉన్నత విద్యావకాశాలు విద్యార్థులకు లభిస్తాయి. పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

సంతాన విద్యా వివాహ విషయాలలో అనుకూలత బాగుంది. అనుకున్న పనులు సమర్థవంతంగా నిర్వ హిస్తారు. సభలు సమావేశాలందు మీ సూచనలు సలహాలు ఆమోదింపబడగలవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం, గృహ వస్తువాహన రిపేర్లుంటాయి. ప్రభుత్వ అనుమతులు దొరకడం, శుభకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలుంటాయి.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అధికారులతో, సహచరులతో, పబ్లిక్‌తో జాగ్రత్తగా మెలగండి. కొన్ని కుటుంబ విషయాలలో నిర్ణయం తీసి కొనలేక ఇబ్బందిపడతారు. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. సోదరులతో బంధువర్గంతో విభేదాలు రావచ్చును. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. అనవసర ఖర్చుల నుండి తప్పించుకొనలేరు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. చెల్లింపుల్లో జాగ్రత్తగా ఉండాలి.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు అవసరం. అనుకోని అదనపు ఖర్చులుంటాయి. బంధువర్గాన్ని కలుసుకొనడం, పెద్దల పరిచయాలుంటాయి. రావలసిన బాకీలు నిలబడి పోతాయి. ఋణాలివ్వడం చేయవద్దు. స్థిరాస్తుల లావా దేవీలు వాయిదా పడటం మంచిది. కొన్ని పనులు అనుకోకుండా పూర్తి కాగలవు. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉంటాయి.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఇతరుల విమర్శనలు, ఆరోపణలను పట్టించుకొన వద్దు. ఆర్థికాభివృద్ధి బాగుండి ఆదాయం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు బాగా సాగుతాయి. కొన్ని పనులు అప్రయత్నంగా జరుగుతాయి. స్థిరాస్తుల వ్యవహారాలను ఆచితూచి వ్యవహరించండి. తొందరపాటు మాటలు, ప్రవర్తన తగ్గించుకొనాలి. ఉద్యోగులకు పని వత్తిడి ఉంటుంది. స్థిరాస్తులపై ఆదాయముంటుంది.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కొత్త ఆర్థిక ప్రయత్నాలు చేస్తారు. పనులందు అను కూలత, కార్యనిర్వహణ సామర్థ్యం బాగుంటుంది. కొందరి విమర్శలుంటాయి. కాని పట్టించుకొనవద్దు. శుభకార్యాలలో పాల్గొంటారు. బంధుమిత్రులను కలుసు కొనడం, దూరప్రయాణాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. బిడ్డల యొక్క విద్యావకాశాలు, శుభకార్య అవకాశాలు ఫలించగలవు.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వ్యవహారాలు ఒప్పందాలలో పరిశీలన అవసరం. అనుకున్న పనులకు ఆటంకాలుండి టెన్షన్ పడుతుం టారు. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉంటాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. పరిచయాలు బలపడ తాయి. అధికారుల సహకారం ఉద్యోగులకు బాగుం టుంది. నిరుద్యోగులకు అవకాశాలు లభించగలవు. ఇంట శుభకార్యాలు నిర్ణయం కాగలవు.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కొత్త ఉద్యోగ, వ్యాపార ప్రయత్నాలలో ముందుకు సాగుతారు. శుభకార్య ప్రయత్నాలు జరుగుతాయి. ఇంట శుభకార్యం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం పెరుగుదల బాగుండి ఆదాయం బాగుంటుంది. బంధు మిత్రులను కలుసుకుంటారు. అధికారిక సేవా కార్యక్ర మాలలో పాల్గొంటారు. ఆర్థిక, కుటుంబ ఇబ్బందులు సర్దుబాటు కాగలవు. ఆరోగ్యం ఫరవాలేదు.

# విద్యాభివృద్ధే ధ్యేయం.. విద్యార్థుల భవితే లక్ష్యం

## - విద్యా ప్రగతిలో ముందడుగు వేస్తున్న ఎన్‌బికెఆర్

విద్యాభివృద్ధే ధ్యేయంగా.. విద్యార్థులకు బంగారు భవితను అందించడమే లక్ష్యంగా విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ విద్యాసంస్థలు నిరంతరం కృషిచేస్తున్నాయి. ప్రతిభకు ప్రాధాన్యత ఇస్తూ, విద్యా నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తూ ఈ విద్యాసంస్థలు విద్యారంగంలో ఎంతో ముందడుగు వేస్తున్నాయి. విద్యానగర్‌లో ఎన్‌బికెఆర్ విద్యాసంస్థలను, కళాశాలను స్థాపించిన దివంగత పద్మశ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి ఆశయాలను నెరవేరుస్తూ, ఆనాటి క్రమశిక్షణను.. ప్రతిభాపాటవాలను అందిపుచ్చుకుంటూ కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విద్యార్థులందరికీ ఉన్నతమైన విద్యాప్రమాణాలను అందిస్తున్నారు. విద్యారంగంలో అనునిత్యం వస్తున్న అనేకానేక సాంకేతిక మార్పులను అవగాహన చేసుకుంటూ, విద్యార్థుల భవితను తీర్చిదిద్దుతున్నారు. అయితే, కేవలం చదువునే కొలమానంగా తీసుకోకుండా క్రీడారంగం, ఇతర విద్యా నైపుణ్యాల్లోనూ విద్యార్థులు ముందంజ వేసేలా కృషి చేస్తున్నారు. మంచి బోధనతో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే అధ్యాపకవర్గం ఎన్‌బికెఆర్‌లో ఎంతోమంది సిద్ధంగా వున్నారు. అందుకే, నాడు ఈ విద్యాసంస్థల్లో చదివిన ఎందరో విద్యార్థులు నేడు దేశవిదేశాల్లో ఎంతో ఉన్నతమైన స్థానాల్లో వున్నారంటే ఇక్కడ క్రమశిక్షణతో కూడిన విద్యే అందుకు ప్రధాన కారణం. ఇక్కడ చదువుకున్న ఎందరో విద్యార్థులు ఇప్పుడు ప్రభుత్వ ఉన్నతశాఖల్లో ఉన్నతాధికారులుగాను, మరికొందరు రాజకీయ రంగంలో కూడా రాణిస్తున్నారు. గతంలో ఇతర యూనివర్శిటీలతో అనుసంధానంగా నడిచిన కళాశాల నేడు సొంత నిర్ణయాలతో విద్యాప్రగతిని అందుకుంటోంది. కళాశాలలోని నిపుణులైన





కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



అధ్యాపకులు రూపొందించే పరీక్షా పత్రాలతో విద్యార్థులను మంచి విద్యావంతులుగా తయారయ్యేలా ఈ కళాశాల అటానమస్ గుర్తింపుకు రావడం ఎంతైనా విశేషం. అంతేకాక, కళాశాలలో చదువుకునే విద్యార్థులకు కళాశాలలోనే ప్రాంగణంలోనే ఉద్యోగ అవకాశాలు దక్కేలా ఇక్కడ క్యాంపస్ ఎంపికలను నిర్వహిస్తుండడంతో, ఎందరో విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నతమైన ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఇప్పటికే ఎన్నోసార్లు జరిగిన క్యాంపస్ ఎంపికలతో ఎంతోమంది విద్యార్థులు ఆ రంగంలో మంచి ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడ్డారు కూడా.

### విశాలమైన తరగతి గదులు.. చక్కని వసతులు

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అయిదువందల ఎకరాల పైబడిన సువిశాల మైదానంలో, పచ్చని ప్రశాంత వాతావరణం, పరిశుభ్రత కలిగిన కళాశాల ప్రాంగణం, విశాలమైన తరగతి గదులు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటుచేసిన లేబొరేటరీలు, విద్యార్థులకు చక్కని వసతి గృహాలు, మంచి ఆరోగ్యవంతమైన భోజన సదుపాయం, విద్యార్థినీ విద్యార్థులకు భద్రతతో కూడిన వసతి.. కళాశాల ప్రాంగణంలోనే ఇవన్నీ సమకూర్చారు. నిరంతరం విద్యాప్రమాణాలను మెరుగుపరుచుకుంటూ, రాష్ట్రంలోనే అన్ని ఉన్నత ప్రమాణాలు వున్న కళాశాలగా ఈ కళాశాల అటు ఉన్నతాధికారులు, ఇటు రాజకీయవేత్తలు ప్రశంసలను సైతం అందుకుంటోంది.

# సంక్షేమ కార్యక్రమాల సృష్టికర్త.. ఎన్టీఆర్






పేదప్రజల, బడుగు బలహీనవర్గాల పెన్నిధిగా వుంటూ స్వర్గీయ ఎన్టీఆర్ వారికి ఎన్నో సేవలందించారని, సంక్షేమ కార్యక్రమాల సృష్టికర్తగా ఆయన ప్రఖ్యాతిగాంచారని వక్తలు కొనియాడారు. పద్మశ్రీ నందమూరి తారకరామారావు 94వ జయంతి సందర్భంగా కావలిలో ఈ నెల 28న ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట వున్న ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలుగుదేశం కావలి పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు మాట్లాడుతూ, పేదవాడికి తిండి, బట్ట, నీడ కల్పించిన మహానుభావుడు ఎన్టీఆర్ అని ప్రశంసించారు. 27వ వార్డు కౌన్సిలర్ గుంటుపల్లి శ్రీదేవి చౌదరి, బొట్లగుంట శ్రీహరినాయుడు, డా. చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ, ప్రజలే దేవుళ్ళుగా భావించి ప్రజలకు ఆయన సేవలందించారని, అందుకే ఎన్టీఆర్ పేదల గుండెల్లో చిరస్మరణీయునిగా నిలిచిపోయారని అన్నారు. రెండు రూపాయలకే కిలో బియ్యం, పెన్షన్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన ఘనత ఆయనేదన్నారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచం నలుమూలలా విఖ్యాతమయ్యేలా చేశారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ ఆశయాలను విస్మరించకుండా అనేకరకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీమతి మలిశెట్టి విజయలక్ష్మి, శెట్టిపల్లి నిర్మల, బిట్రగుంట శివప్రసాద్, ద్రోణాదుల వెంకట్రావ్, జెట్టి శేషారెడ్డి, పొదర్తి నాదరాజు, సిహెచ్ రామకృష్ణ నారా మాలకొండయ్యనాయుడు, ఇంకా టిడిపి అనుబంధ సంఘాల నాయకులు దావులూరి దేవకుమార్, వల్లేరు కిరణ్‌కుమార్, అక్కిలిగుంట శివప్రకాష్, దార్ల శివకుమార్, మైనార్టీ నాయకులు షేక్ ఖాదర్‌బాషా, నక్కా కృష్ణయాదవ్, గొర్రెపాటి బ్రహ్మయ్య, దావులూరు తిరుపతి, పూడిపర్తి జాలరామ్, చలమయ్య, ఇమ్మిడిశెట్టి సుధాకర్ తదితరులతో పాటు, తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి వంశాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

# కావలి రోడ్ల అభివృద్ధికి కృషి చేయండి



నవ్యాంధ్ర రాజధాని నిర్మాణ సలహా కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు విశాఖలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి వెళ్ళి అక్కడ రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. కావలి నియోజకవర్గంలో పంచాయతీరాజ్‌శాఖ ద్వారా నిర్వహించాల్సి వున్న అభివృద్ధి కార్యక్రమాల విషయమై చర్చించారు. ఈ నియోజకవర్గంలోని ఎస్సీఎస్టీ కాలనీల్లో ఇంకా సిసి రోడ్ల నిర్మాణం అసంపూర్తిగానే వుందని, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరుచేసి రోడ్లను అభివృద్ధి చేయాలని బీదా మస్తాన్‌రావు కోరారు. మంత్రి లోకేష్ స్పందించి అందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మస్తాన్‌రావుతో పాటు, ఆయన సోదరుడు, జిల్లా టిడిపి కార్యదర్శి బీద రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా లక్ష్మీనృశింహుని కళ్యాణం



నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లోని శ్రీ సాయి దర్బార్ అద్దాల మందిరం ప్రథమ పుష్కర మహా కుంభాభిషేక మహోత్సవాలు గత నెల 19వ తేదీన ప్రారంభమై 30వ తేదీన వైభవంగా ముగిసాయి. గత నెల 27వ తేదీ సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం, శ్రీసాయి సచ్చరిత్రము సామూహిక పారాయణం కనువిందుగా జరిగింది. 28వ తేదీ శ్రీ సాయి సచ్చరిత్రముల శోభాయాత్ర మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో భక్తులు శ్రీ సాయి సచ్చరిత్రములను తమ శిరస్సుల పైన ధారణ చేసి సాయినామ సంకీర్తనలతో నగర వీధుల్లో ఊరేగింపుగా సాగారు. 29వ తేదీ శ్రీసాయి సత్యవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆధ్యాత్మిక భాస్కర కోట కృష్ణమూర్తి స్వామి ఆధ్వర్యంలో శ్రీ సాయినాథునికి 108 రజత కమలాలతో అష్టోత్తర అర్చన నిర్వహించారు. సాయంత్రం ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో హరినామ సంకీర్తన జరిగింది. 30వ తేదీ మంగళవారం శ్రీ పెనుశిల నరసింహస్వామి వారి కళ్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ప్రధానాచార్యులు కోట కృష్ణమూర్తి స్వామి ఆధ్వర్యంలో తిరుమల, పెంచలకోనకు చెందిన వేదపండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మందిరం ప్రథమ మహాకుంభాభిషేక పుష్కర మహోత్సవం ముగింపు సందర్భంగా నెల్లూరుజిల్లాలో ప్రప్రథమంగా జరిగిన స్వామివారి కళ్యాణోత్సవానికి భక్తులు విశేషంగా పాల్గొన్నారు. సాయంత్రం శ్రీ సాయిదర్బార్ భక్తబృందంచే పండరీ భజనలు, కోలాటాలు ఉత్సాహంగా జరిగాయి. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

# మైమరపించిన నృత్య కళోత్సవం



విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీ రామారావు 95వ జయంతి సందర్భంగా రంగస్థలి మాసపత్రిక 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంస్కృతి తరంగాలు నెల్లూరు వారి నిర్వహణలో ఆదివారం నెల్లూరు టౌన్‌హాల్లో నిర్వహించిన బాలల నృత్య కళోత్సవం సభికులను మైమరపించింది. జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ చూపి ప్రథములుగా నిలిచిన బాలికలు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. ముఖ్యఅతిథులుగా రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ జి.గోపీనాథ్‌రెడ్డి, నెల్లూరు ఏపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ పి.కళాధరరావు, సంస్కృతి తరంగాలు నిర్వాహకులు రేణిగుంట రాజశేఖర్ పాల్గొన్నారు. కళాకారులకు ఎన్టీఆర్ స్మారక నాట్య తరంగిణి అవార్డులు, ప్రతిభామూర్తులకు ఎన్టీఆర్ స్మారక అవార్డులను రంగస్థలి సంపాదకులు కె.ఎన్.రాజా అందజేశారు.

# దుగరాజపట్నం పోర్ట్‌కు బాబు అడ్డుచక్రం

## - తిరుపతి ఎంపి వరప్రసాద్‌రావు విమర్శ

వాకాడు మండలంలో వున్న దుగరాజపట్నంకు పోర్ట్ రాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు అడ్డుచక్రం వేస్తున్నారని తిరుపతి ఎంపి వరప్రసాద్‌రావు విమర్శించారు. జిల్లాలోని మల్లాం గ్రామంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అనుసరిస్తున్న విధానాలపై ధ్వజమెత్తారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పార్లమెంట్‌లో మాట్లాడుతూ, దుగరాజపట్నం పోర్ట్ నిర్మాణానికి కేంద్రం సిద్ధంగావుందని, 2018 నాటికి పోర్ట్ మొదటిదశ నిర్మాణపనులు సుమారు రెండువేల కోట్లతో మొదలు పెట్టాల్సివుందని, చంద్రబాబు నుంచి అనుమతి లేఖ వస్తే వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారని ఆయన వివరించారు. అయితే, ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాలో ప్రైవేట్ పోర్ట్‌ను కాపాడేందుకు, ఈ ప్రాంత ప్రజలకు పోర్ట్ రానివ్వకుండా తీరని అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. దుగరాజపట్నం పోర్ట్ వస్తే జిల్లాలోని గూడూరు, సూళ్ళూరుపేట, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా వుంటుందన్నారు.

# పార్టీ పట్టాలు తప్పిందా?

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులను ఒకేసారి తొలగించినప్పుడు కూడా ఏ ఒక్కరూ ధిక్కరించలేదు. ఆయన చేసిన పనిని వేలెత్తి చూపలేదు. పార్టీపై ఆయన కమాండింగ్ అలాంటిది. 1995లో చంద్రబాబు చతికిలబడే వరకు కూడా ఎన్టీఆర్ పార్టీపై తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయించారు. చంద్రబాబు ఇచ్చిన ఒకే ఒక షాక్‌తో పార్టీయే అతని చేతుల్లో లేకుండా పోయింది. పార్టీని తన చేతుల్లోకి తీసుకున్నాక చంద్రబాబు పార్టీపై అదే ఆధిపత్య ధోరణి కొనసాగించాడు. 2004వరకు పార్టీపై చంద్రబాబు పెత్తనానికి తిరుగులేకుండా పోయింది. ఆ తర్వాత వరుసగా పదేళ్ళు పార్టీ అధికారంలో లేకపోవడంతో చంద్రబాబు నాయకత్వం బలహీనపడింది.

వై.యస్. మరణం, ఏపి విభజన చంద్రబాబుకు రాజకీయంగా పునర్జన్మనిచ్చాయని చెప్పుకోవచ్చు. 2014లో అధికారం కోసం చంద్రబాబు ఎన్ని అడ్డదారులు తొక్కాలో అన్నీ తొక్కాడు. అడ్డమైన వాళ్ళందర్నీ పార్టీలో చేర్చుకున్నాడు. ఓట్ల కోసం పార్టీకి సంబంధం లేని వాళ్ళ ముందు మోకరిల్లాడు. కాంగ్రెస్ నాయకులకైతే పార్టీ గేట్లు బార్లా తెరిచాడు. అధికారం కోసం ఒక మెట్టు కాదు, చాలామెట్లే చంద్రబాబు దిగాడు.

2014లో చంద్రబాబు సీఎం అయ్యాడంటే అది ఒక్క ఒరిజినల్ తెలుగుదేశంపార్టీ కేడర్ వల్లే సాధ్యం కాలేదు, కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల నుండి తెలుగుదేశంలోకి వచ్చిన వారివల్ల, లేదంటే బయట వుండి మద్దతునిచ్చిన వారి వల్లే సాధ్యమైంది. ఇక్కడే పార్టీపై చంద్రబాబు పట్టు కోల్పోయాడు. పార్టీ కూడా సైద్ధాంతిక పట్టాలను తప్పింది. పార్టీలో ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ళు మాట్లాడుతున్నారు. జేసీ దివాకర్‌రెడ్డి ఏదంటే అది వాగుతాడు. చింతమనేని ప్రభాకర్‌రావు అధికారులను యధేచ్ఛగా కొడతాడు, ఒక ఎమ్మెల్యే ఎస్ఐనే నిర్బంధిస్తాడు. ఒక పార్టీలో వున్న ఫ్యాక్షనిస్టులు ఒకర్నొకరు చంపుకుంటుంటారు. ఒక ఎమ్మెల్యే బహిరంగంగానే రౌడీయిజం చేస్తాడు. ఒక ఎంపీ రాష్ట్ర స్థాయి అధికారుల మీదనే దౌర్జన్యానికి దిగుతాడు. మొన్న చూసాం... మంత్రి పదవులు రాని నాయకులు చంద్రబాబుపైనే మంటలు కక్కడం. ఇలాంటి పరిణామాలు గతంలో ఎప్పుడూ తెలుగు దేశంలో కనిపించేవి కావు. కాని ఇప్పుడు పార్టీలో అవి మాత్రమే ప్రధానంగా కనిపిస్తున్నాయి.

పార్టీలో చంద్రబాబు అంటే భయమూ, భక్తి పోయింది. ఆయన నాయకత్వం మీద నమ్మకం పోతోంది. మొన్నటి ఎన్నికల్లో మోడీ ఇమేజ్, పవన్‌కళ్యాణ్ ప్రచారం, చంద్రబాబు అబద్దాలతోనే గెలిచామనే ఓ బలమైన నమ్మకం పార్టీ కేడర్‌లో పాతుకుపోయింది. కాబట్టే పార్టీ చంద్రబాబు గుప్పిట్లో లేదు. చంద్రబాబు, పార్టీ... ఇద్దరు కూడా ఇతరుల చేతుల్లో వున్న పరిస్థితులు నెలకొన్నాయి.



# విద్యార్థులు విజయాల పరంపరను కొనసాగించాలి

ప్రతి తరగతి, ప్రతి పరీక్షలో విద్యార్థులు విజయపరంపరను కొనసాగించాలని నెల్లూరుజిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరు జడ్పీ సమావేశ మందిరంలో జడ్పీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కుల కోసం చదివితే చదువు రాదని, సబ్జెక్ట్‌పై పట్టు సాధించేందుకు చదివితే మార్కులు పరుగులు తీస్తాయన్నారు. జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ జడ్పీ మోడల్ కాలేజీల ఏర్పాటుకు కృషి చేస్తున్నానని, ఆత్మకూరు, వెంకటగిరి, గూడూరులో ప్రారంభించాలని తెలిపారు. కేవలం ఆర్థికపరమైన అంశాలు ప్రతిబంధకాలైతే జడ్పీ నుంచి నిధులను అందిస్తానన్నారు. ఈ ఏడాది జిల్లా ఉత్తీర్ణత శాతం 94.8 అయితే, జడ్పీ పాఠశాలల్లో 91.6 శాతం సాధించగలిగామన్నారు. 12824మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు.

**ప్రతిభకు పురస్కారం:** నియోజకవర్గాల వారీగా మొదటి మూడు స్థానాలు, జిల్లాలో మొదటి మూడు స్థానాలను సాధించిన 153మంది విద్యార్థులు, దివ్యాంగుల్లో జిల్లాలో మొదటి రెండు స్థానాలను సాధించిన విద్యార్థులకు జ్ఞాపిక, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. జడ్పీ పాఠశాలల్లో నూరు శాతం ఫలితాలను సాధించిన ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. జడ్పీ ఇన్‌ఛార్జ్ సిఇఓ వసుమతి, ఉమాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# చెంగాళమ్మ పరమేశ్వరికి వెండిపీఠం బహుకరణ

నెల్లూరుజిల్లా సూళ్ళూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి నెల్లూరుకు చెందిన టీవీ వసంత్‌కుమార్‌రెడ్డి దాతృత్వంతో 1.340కిలోల బరువు కలిగిన వెండి పీఠాన్ని సోమవారం బహుకరించారు. ఆలయ ఛైర్మన్ ముప్పాళ్ళ వెంకటేశ్వర్లురెడ్డి, ఇ.ఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# రవాణాశాఖలో అతడే రారాజు...!

**అతడు కేవలం కానిస్టేబుల్. హెడ్‌కానిస్టేబుల్‌గా ప్రమోషన్ వచ్చినా ట్రాన్స్‌ఫర్ వస్తుందనే భయంతో ప్రమోషన్‌ని తిరస్కరించి "పిట్‌నెస్" విభాగ టేబుల్‌కే పదమూడేళ్ళుగా పరిమితమైపోయిన పవర్‌ఫుల్ కానిస్టేబుల్.**

**కుటుంబసభ్యుల పేరుతో ఇన్సూరెన్స్ కంపెనీ పెట్టాడు, దొడ్డిదారిలో అక్రమార్జన మరిగాడు. స్కూళ్ళ యజమానులకు చుక్కలు చూపిస్తున్నాడు. వందలాది వాహనాలకు తానే ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా మారాడు. ఆ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా దొడ్డిదారిన భారీగా అక్రమార్జనకు పాల్పడుతున్నాడనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వాహన యజమానులు, స్కూళ్ళ యజమాన్యాలూ దిక్కు తెలియక ఎవరికి మొరపెట్టుకోవాలో అర్ధంకాక సతమతమౌతున్నారు.**

- **ఫిట్‌నెస్ సర్టిఫికేట్లకు వెళ్తే... ఇన్సూరెన్స్ ఫిటింగ్...!**
- **జిల్లా అధికారి చెప్పాడంటూ బెదిరింపులు**
- **బెంబేలెత్తుతున్న వాహన యజమానులు**




నెల్లూరు నగరంలో ఇప్పుడు 'టాక్ ఆఫ్ ది టౌన్' ఏమిటంటే, 'ఫిట్‌నెస్' సర్టిఫికెట్ల మాయాజాలమే. ఎక్కడ విన్నా దీనిగురించే చర్చ జరుగుతోంది. ఈ సర్టిఫికెట్‌ల పేరుతో వాహనాల యజమానులను నిలువుదోపిడీ చేస్తున్నారనే విషయం నగరమంతా వినిపిస్తోంది. రవాణా శాఖలో జరుగుతున్న ఈ మాయాజాలం పై ప్రజలు, వాహనాల యజమానులు జోరుగానే చర్చించుకుంటున్నారు. ఇంతకీ ఆ కథా కమామిషు ఏమిటంటే, ఆర్టీఏ కార్యాలయంలో ఓ పేరుమోసిన కానిస్టేబుల్ ఈ తంతు అంతా గుట్టుచప్పుడు కాకుండా కానించేస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నెల్లూరు నగరంలో కనీసం వెయ్యికి పైగానే స్కూల్ బస్‌లు వున్నాయి. ఇవి కాక, ఆటోలు, ఇతరత్రా వాహనాలు పెద్దసంఖ్యలోనే వున్నాయి. అయితే, ఇవన్నీ ఏడాదికోసారి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలి. ఇదే అదనుగా, ఆ విభాగంలో వున్న ఓ కానిస్టేబుల్ ధనార్జనకు మరిగి, అక్రమాలకు తెరతీసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొంతకాలంగా జరుగుతున్న ఈ ప్రహసనం గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇక ఆయనదే ఇష్టారాజ్యమైపోయిందని, గత పదమూడేళ్ళుగా అదే సీట్‌లో పాతుకుపోయిన ఆయన, తన కుటుంబ సభ్యుల పేరుతోనే ఓ ఇన్సురెన్స్ కంపెనీ కూడా ప్రారంభించి, వందలాది వాహనాలకు తానే ఇన్సురెన్స్ ఏజెంట్‌గా మారాడని, ఈ సర్టిఫికెట్‌ల మాయాజాలంతో రెండుచేతులా అక్రమార్జన చేస్తున్నాడని వాహనాల యజమానులు గగ్గోలు పెడుతున్నారు. తనకు హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ వచ్చినా, ఆ ప్రమోషన్‌ను అంగీకరిస్తే తానెక్కడికి బదిలీ అవాల్సివస్తుందేమోనని ప్రమోషన్‌ను కూడా తిరస్కరించిన ఘనత ఆయనకే దక్కుతుందని, ఇంతగా ఆయన అక్కడ పాతుకుపోయినా పట్టించుకునే అధికారే లేదని వారు వాపోతున్నారు. అదేమని అడిగితే, జిల్లా ఉన్నతాధికారుల పేరు చెప్పి బెదిరిస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రవాణాశాఖ పరువు పోయే విధంగా, తన విభాగాన్నే అక్రమాల అడ్డాగా మార్చుకుని అడ్డదిడ్డంగా ముడుపులు మూటగట్టుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా ఉన్నతాధికారులైనా ఈ విషయాలు పరిశీలించి, నిజానిజాలు వెల్లడించాలని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల పేరుతో జరుగుతున్న ఈ నిలువుదోపిడి విషయాన్ని విచారించి తగు చర్యలు తీసుకోవాలని వాహనాల యజమానులు కోరుకుంటున్నారు. వాహనాల యజమానుల పట్ల ఇలా అక్రమరీతిలో వ్యవహరించడం అన్యాయమని, ఇకనైనా వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల పంపిణీలో రవాణా అధికారులు నిజాయితీగా, పారదర్శకంగా వ్యవహరించేవారిని ఆ విభాగంలో నియమించాలని వాహనాల యజమానులు కోరుకుంటున్నారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com